# కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ మంగళవారం 26 నవంబర్ 2024

సంపుటి: 14, సంచిక: 237, పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


## ప్రధాని విశాఖ పర్యటన రద్దు

### తుపాను హెచ్చరికల నేపథ్యంలో వాయిదా



అమరావతి నవంబర్ 25 (నిఘా న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటన పర్యటన రద్దయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 29న ప్రధాని మోదీ విశాఖలో పర్యటించాల్సి ఉంది. అయితే ప్రతికూల ..మిగతా 2లో

## అదానీతో ఒప్పందాలన్నీ రద్దు చేయాలి

మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్



2

# ఆదానీ విరాళం... 100 కోట్లు వాపస్

### అంబానీ, అదానీ, టాటా, ఎవరికైనా తెలంగాణలో వ్యాపారం చేసుకొనే హక్కు ఉంది



- చట్టబద్ధంగా నిర్వహించే టెండర్లలో అందరికీ సమాన అవకాశాలు
- చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు స్వీకరణ
- స్కిల్ వర్సిటీ కోసం ప్రకటించిన వందకోట్లు వెనక్కి
- ఢిల్లీకి ఎన్నిసార్లయినా వెళుతూనే ఉంటాం
- ఆదానీ విరాళంపై విమర్శల నేపథ్యంలో రేవంత్ ప్రకటన

*కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతున్నారు, జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని భావిస్తున్నారు. జైలుకెళ్లిన వాళ్లు సీఎం అయ్యేదుంటే ముందు కల్వకుంట్ల కవిత అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం కుర్చీ కోసం పోటీ ఎక్కువైంది.*

హైదరాబాద్ నవంబర్ 25 (నిఘా న్యూస్): అదానీ గ్రూప్‌పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్‌పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడిరచారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమి అదానీపై వివాదానికి, తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంబానీ, అదానీ, టాటా ఎవరికైనా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. అయితే ఆదానీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వందకోట్ల విరాళం తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ..మిగతా 2లో



## ఔట్ సోర్సింగ్‌కు ప్రాజెక్టులు రోడ్ల నిర్మాణం, నిర్వహణ

### టోల్ వసూలుతో నిర్వహణా భారం

ఏపీలో ప్రయోగాత్మక అమలుకు నిర్ణయం

పైలెట్ ప్రాజెక్టుగా ఉభయ గోదావరి జిల్లాలో టోల్ గేట్లు

అమరావతి నవంబర్ 25 (నిఘా న్యూస్): తెలుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పబ్లిక్,ప్రైవేటు పార్టనర్ షిప్ గురించి ఇటీవలి కాలంలో బాగా ఫోకస్ పెడుతున్నారు. శీఘ్ర గతిన అభివృద్ధితో పాటు,ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ మోడల్ కొన్ని విభాగాల్లో అమలు చేస్తున్నారు. జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో రోడ్ల నిర్వహణను అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించాలని చంద్రబాబు యోచిస్తున్నారు. వారు టోల్ ఫీజు వసూలు చేసుకుంటారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రోడ్లపైన పైలట్ ప్రాజెక్టుగా టోల్‌గేట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అసెంబ్లీలో చెప్పారు. ఈ క్రమంలో చంద్రబాబునాయుడు ఏపీలో అభివృద్ధి పనులకు ఈ మోడల్ అనుసరించాలనుకుంటున్నారు. అంటే రోడ్లను ప్రైవేటు కంపెనీలతో వేయిస్తారు. ప్రజల నుంచి టోల్ వసూలు చేస్తారు. ఇప్పటి వరకూ జాతీయ రహదారుల్లో ఈ విధానం ఉంది. ఇప్పుడు రాష్ట్ర రహదారులకూ తీసుకు వస్తారు. అలాగే గోదావరి నీటిని బనకచర్ల వరకూ తీసుకెళ్లేందుకూ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు రూ. 70వేల కోట్లు ఖర్చవుతాయి. అంటే ఆ డబ్బులూ ప్రజలు కట్టాల్సిందే. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర,జాతీయ రహదారులకు వెళ్లే మార్గాల్లో ..మిగతా 2లో



## హిందూ ముస్లింల మధ్య వివక్ష... దేశానికి ప్రయోజనకరం కాదు

సంభాల్ కాల్పులు అత్యంత దురదృష్టకరం

కాల్పుల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటించిన రాహుల్

2

## ముఖ్యమంత్రిగా రేవంత్‌కు రోజులు దగ్గరపడ్డాయి

ఈ ముఖ్యమంత్రి తన సొంత అల్లుడు, అదానీ, అన్నదమ్ముల కోసం తప్ప రాష్ట్ర ప్రజల కోసం పని చేయడం లేదు

మేము కేసీఆర్ తయారు చేసిన దళం, భయపడే ప్రసక్తే లేదు

మహబూబాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్



హైదరాబాద్ నవంబర్ 25 (నిఘా న్యూస్): అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాలో ..మిగతా 2లో



## ప్రజలు తిరస్కరించినోళ్లు... పార్లమెంటులో గుండాయిజం చేస్తున్నారు

పార్లమెంట్‌లో ఫలవంతమైన చర్చలు జరగాలి

నేడు సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినత్సవం

పార్లమెంట్ మీడియా పాయింట్ వద్ద ప్రధాని

న్యూఢిల్లీ నవంబర్ 25 (నిఘా న్యూస్): ప్రజలతో తిరస్కరణకు గురైన వారు పార్లమెంట్‌ను నియత్రించే పనిలో ఉన్నారని ప్రధాని మోడీ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సమస్యలపై చర్చకు అంతా సిద్దంగా ఉండాలని, ప్రభుత్వం అందుకు సంసిద్ధంగా ఉందన్నారు. శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు. పార్లమెంట్‌లో ఫలవంతమైన చర్చలు జరగాలని ..మిగతా 2లో



## జగన్-అదానీ ఒప్పందాలను రద్దు చేయాలి

అదానీ నుంచి 1750 కోట్ల ముడుపులు అందుకున్న జగన్

రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

సీఎం చంద్రబాబుకు వైఎస్ షర్మిల బహిరంగ లేఖ

2



## తెలంగాణలో అంబర్ పెట్టుబడులు రూ.250 కోట్లు

సంస్థ రాకతో వెయ్యి ఉద్యోగాలు లభించే అవకాశం

ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

2

## పరారీలో రామ్‌గోపాల్ వర్మ?

భయమనేది తన బ్లడ్‌లోనే లేదు అంటూ చెప్పుకొచ్చే వర్మ

తమిళనాడులో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు



## మహా పీఠంపై వీడని ఉత్కంఠ



ఏ ఫార్ములాపై చర్చ జరగడం లేదు

మేము ముగ్గురం (కూటమి) కలిసి సీఎం పదవిపై చర్చిస్తాం

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్

ముంబై నవంబర్ 25 (నిఘా న్యూస్): మహాయుతి కూటమి 236 సీట్లతో అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. సీఎం సీటుకు సంబంధించి ఏద్కెనా ఫార్ములాపై చర్చ జరుగుతోందా అనే విషయంపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సోమవారం స్పందించారు. అలాంటి ఫార్ములా ఏదీ చర్చకు రాలేదని ఆయన చెప్పారు. మహాయుతి ప్రభుత్వానికి పట్టం కడుతూ ప్రజలు చాలా గట్టి తీర్పునిచ్చారని, అసెంబ్లీ విపక్ష నేత పదవికి అవసరమైన సంఖ్యాబలం కూడా ..మిగతా 2లో

## తెలంగాణలో పెరిగిన చలి

పలుచోట్ల 10 డిగ్రీల కంటే తక్కువగ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ నవంబర్ 25 (నిఘా న్యూస్): తెలంగాణ చలి తీవ్రత బాగా పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదు అవుతున్నట్టు తెలుస్తోంది. ఏపీలో వర్షాలు పడే అవకాశం ఉన్నప్పటికీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని అంటున్నారు. హైదరాబాద్‌లో కూడా చలి పిడుగు ..మిగతా 2లో



# ఆదానీ విరాళం 100 కోట్లు వాపస్

మొదటి పేజీ తరువాయి...

అదానీ ఇచ్చిన రూ.100 కోట్లు ముఖ్యమంత్రి, మంత్రులకు ఇచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన రూ.100 కోట్లు స్వీకరించకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు బదిలీ చేయవద్దని అదానీ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం తరఫున లేఖ సైతం రాసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా అదానీ అంశంపై తీవ్ర దుమారం రేగుతోందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు సేకరించినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. అయితే చట్టబద్ధంగా నిర్వహించే టెండర్లలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు స్వీకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడిరచారు. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగ వద్దని ఈ సందర్భంగా ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతున్నారన్నారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని కేటీఆర్ భావిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జైలుకెళ్లినవాళ్లు సీఎం అయ్యేదుంటే.. ముందు కల్వకుంట్ల కవిత అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉందన్నారు. తన తాజా ఢిల్లీ టూర్ పర్యటనపై సైతం సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే ఈ ఢిల్లీ పర్యటన అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఢిల్లీ పర్యటనతో రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేదని ఆయన ప్రకటించారు. పార్లమెంట్ సమావేశాలపై మంగళవారం పార్టీ ఎంపీలతో చర్చిస్తామని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న మంత్రులను కలిసి రాష్ట్ర సమస్యలను వారికి వివరిస్తామని చెప్పారు. అయితే తాను 28 సార్లు ఢిల్లీ వెళ్లానని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీలా పైరవీలు చేయడానికి బెయిల్ కోసం తాను ఢిల్లీ వెళ్లడం లేదని బీఆర్ఎస్ అగ్రనేతలను పరోక్షంగా విమర్శించారు. కానీ కేంద్రాన్ని కలిసి మనకు రావాల్సినవి రాబట్టుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం అవసరమైతే ఎన్నిసార్లు అయినా ఢిల్లీ వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అదానీకి ఎన్నో ప్రాజెక్టులు కట్టబెట్టిందని గుర్తు చేశారు. అదానీ సంస్థపై లంచాల విమర్శల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై విధంగా స్పందించారు. అదానీ విషయంలో కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు స్వీకరించిందని కొందరు విమర్శలు చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు అనుమతిస్తాం. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నాం. దేశంలో ఏ సంస్థలకైనా చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొనే హక్కు ఉంటుంది. అంబానీ, అదానీ, టాటా,ఎవరికైనా తెలంగాణలో వ్యాపారం చేసుకొనే హక్కు ఉంది. గొప్ప సంకల్పంతో లక్షలాది మంది నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించే లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. గొప్ప సదుద్దేశంతో ప్రారంభించిన ఈ వర్సిటీ వివాదాలకు లోను కావడం మంత్రివర్గ సహచరులకు, నాకు, ప్రభుత్వానికి ఇష్టంలేదు. అదానీ గ్రూప్ స్కిల్స్ వర్సిటీకి ఇచ్చిన విరాళాన్ని సీఎం, మంత్రులకు ఇచ్చినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారు. సీఎస్ఆర్ కింద స్కిల్స్ వర్సిటీకి అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని కోరుతూ ఆ గ్రూప్‌నకు లేఖ పంపాం. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగొద్దు. తెలంగాణ ప్రభుత్వ ఖాతాల్లోకి ఎవరి నుంచీ డబ్బులు రాలేదు అని సీఎం అన్నారు.

## ముఖ్యమంత్రిగా రేవంత్‌కు రోజులు దగ్గరపడ్డాయి

మొదటి పేజీ తరువాయి...

కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు. వీడు పచ్చి లంగా, తెలంగాణలో ఆడబిడ్డలను మోసం చేశాడని చైతన్యం ప్రదర్శించి తన్ని తన్ని తరిమేశారని పేర్కొన్నారు. నేను ఇక్కడ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. నేను డీజీపీ, ఎస్పీ ని అడుగుతున్నా రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం, భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు. మానుకోటలో 14 ఏళ్ల క్రితమే నిప్పు పుట్టి ఆ తర్వాత తెలంగాణ వచ్చిందని అన్నారు. ఇవాళ మీరు పర్మిషన్ ఇవ్వకుంటే హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకున్నామని అన్నారు. ఈ మహా ధర్నాకు వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని, అంటే ప్రభుత్వం మీద ఎంత కోపం, వ్యతిరేకత ఉందో ఈ మానుకోట మహాధర్నా చూస్తే అర్థమవుతోందని అన్నారు.

### తెలంగాణ ఉద్యమంలో మానుకోట కీలకం

ఇదే మానుకోట 14 ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో ఓ కీలకమైన మలుపునకు కారణమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ అదే మానుకోట ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధిచెప్పేందుకు సిద్ధమైందని తెలిపారు. అసలు ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని కేటీఆర్ తెలిపారు. వారి భూములను తీసుకుంటామని చెబితే మా ఆడబిడ్డలు 9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. కానీ ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మీద ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి, ఉరికించి కొట్టేవారని అన్నారు. ఎందుకంటే ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని గుర్తుచేశారు. రైతుల పవర్ అంటే ఆ విధంగా ఉంటుందని, అలాంటి పవర్ ఉన్న రైతులతో రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని మండిపడ్డారు.

### ఫార్మా విలేజ్ ఎవరి కోసం.....

ఫార్మా విలేజ్ ఎవరి కోసమని కేటీఆర్ ప్రశ్నించారు. తన అల్లుడి కోసం రేవంత్ రెడ్డి పేదవాళ్ల భూములను గుంజుకుంటున్నాడని మండిపడ్డారు. ఈ ముఖ్యమంత్రి తన సొంత అల్లుడు, అదానీ, అన్నగాడు, తమ్ముని కోసం తప్ప రాష్ట్ర ప్రజల కోసం పని చేయడం లేదని విమర్శించారు.

## పరారీలో రామ్‌గోపాల్ వర్మ?

అమరావతి నవంబర్ 25 (నిఘా న్యూస్): దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పరారీలో ఉన్నట్టు ప్రకాశం జిల్లా పోలీసులు అనుమానిస్తున్నారు. రెండుసార్లు విచారణకు హాజరు కాకపోవడంతో అరెస్టు ఖాయమని గ్రహించిన ఆయన తప్పించుకుని తిరుగుతున్నారని భావిస్తున్నారు. అందుకే ఆయన ఎక్కడ ఉన్నా సరే పట్టుకోవాలని చూస్తున్నారు. అయితే ఇప్పుడు పోలీసులకు అందుకున్న సమాచారం ప్రకారం తమిళనాడులో ఆర్జీవీ ఉన్నారని తెలుస్తోంది. అందుకే ఆయన్ని అక్కకడే పట్టుకోవాలని చూస్తున్నారు. తమిళనాడులో ఉన్న ఆర్జీవీ అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. అక్కడి పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆయనకు వ్యతిరేకంగా నమోదు అయిన కేసుల వివరాలు, కోర్టు తీర్పులను పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు ఆయన అరెస్టుకు సహకరించాలని వారిని కోరబోతున్నారు. ఆర్జీవీ ఇంట్లోనే విచారణ చేసేందుకు ప్రకాశం జిల్లా పోలీసులు హైదరాబాద్‌లో ఉన్న ఇంటికి వచ్చారు. అప్పటికే ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయారని సిబ్బంది తెలియజేశారు. ఎక్కడికి వెళ్లారని ఆరా తీస్తే తమకు తెలియదని చెప్పారు. అయితే పోలీసులు వారిని విచారించి ఆర్జీవీ ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై వివరణ ఇవ్వాలని విచారణకు రావాలని ఇప్పటికే రెండుసార్లు ఒంగోలు పోలీసులు ఆర్జీవి నోటీసులు జారీ చేశారు. తనకు షూటింగ్ ఉన్నందున విచారణకు హాజరుకాలేనని మొదటి సారి పోలీసులకు సమాధానం చెప్పారు ఆర్జీవి. రెండోసారి నోటీసులు జారీ చేశారు. దాని ప్రకారం ఇవాళ హాజరు కావాల్సి ఉంది. దీంతో ఆయన విచారణకు హాజరు కాక పోవడంతోపాటు మరో రెండు వారాల సమయం కావాలని కోరినట్టు చెబుతున్నారు. విచారణకు ఆర్జీవీ మరింత సమయం అడగడంతో పోలీసులు నేరుగా ఆయన ఇంటికి వచ్చారు. ఇలా ఇంటికి రావడంపై ఆర్జీవీ అడ్వకేట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టులో పిటిషన్ల విచారణ పెండిరగ్‌లో ఉందని మరో రెండు వారాలు గడువు కూడా కోరామన్నారు. దీనికి సమాధానాలు చెప్పకుండా నేరుగా ఇంటికి రావడమేంటని అంటున్నారు. తాము డిజిటల్ విచారణకు అంటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతామని కూడా చెప్పినట్టు వెల్లడిరచారు. వీటికి అంగీకరించకుండా నేరుగా రావడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెబల్‌గా ఉంటూ నాకు నచ్చిందే చేస్తా, నచ్చినట్టు బతుకుతా అనే ఓ వర్గానికి డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ ఇన్‌స్పిరేషన్, భయమనేది తన బ్లడ్‌లోనే లేదు అంటూ చెప్పుకొచ్చే వర్మలో భయం మొదలైందనే చర్చ నడుస్తోంది. ప్రత్యర్థులపై మెయిన్ మీడియాలో ఇంటర్వ్యూల ద్వారా, సోషల్ మీడియా పోస్టుల ద్వార చెలరేగిపోయే ఆర్జీవీ ఇప్పుడు డిఫెన్స్‌లో పడ్డారు. సోషల్ మీడియా పోస్టుల విషయంలో తనకు వచ్చిన నోటీసులపై హైకోర్టును ఆశ్రయించిన ఆర్జీవీ తనను అరెస్టు చేస్తారేమో అని అనుమానం వ్యక్తంచేశారు. తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుడే ఆర్జీవీకి భయం మొదలైందని కూటమి శ్రేణులు కామెంట్స్ చేశాయి. ఇప్పుడు పోలీసులకు చిక్కకుండా పారిపోవడంతో పాటు నేరుగా విచారణకు హాజరు కాబోనని డిజిటల్ విచారణకు ఓకే చెప్పడం కూడా అందుకే అంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్‌కు అనుకూలంగా చిత్రాలు తీసిన ఆర్జీవీ చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫ్యామిలీపై వివాదాస్పద పోస్టులు పెట్టారు. ఎవడ్కైతే నాకేంటి అన్నట్టు కామెంట్స్ చేయడమే కాకుండా సోషల్ మీడియా పోస్టులు కూడా పెట్టారు. ప్రత్యర్థులను రెచ్చగొట్టేలా వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పెట్టిన పోస్టులు ఇప్పుడు ఆర్జీవీ మెడకు చుట్టుకుంటున్నాయి.

## జగన్-అదానీ ఒప్పందాలను రద్దు చేయాలి

అమరావతి నవంబర్ 25 (నిఘా న్యూస్): మాజీ సీఎం జగన్ అదానీతో చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలను రద్దు చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆమె బహిరంగ లేఖ రాశారు. అదానీతో ఒప్పందం రాష్ట్రానికి పెను భారమని ఈ అక్రమ ఒప్పందాలతో 25 ఏళ్ల పాటు పాటు ప్రజలపై రూ.లక్షన్నర కోట్ల భారం పడుతుందని అన్నారు. 'విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో గౌతమ్ అదానీ నుంచి రూ.1750 కోట్ల ముడుపులు అందుకున్న జగన్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. ఈ విషయంలో లంచాలు తీసుకున్నట్లు ఇప్పటికే అమెరికాకు చెందిన దర్యాప్తు సంస్థలు నిరూపించాయి. జగన్ ఏపీ పరువును తీశారు. లంచాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు. అదానీ దగ్గర నుంచి గుజరాత్ యూనిట్ ధర రూ.1.99 పైసలకు కొంటుంటే, ఏపీ మాత్రం యూనిట్ ధర రూ.2.49 పైసలుగా అగ్రిమెంట్ చేసుకున్నారని షర్మిల మండిపడ్డారు. అదానీతో చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు మొత్తం సీఎంవో నుంచే నడిచాయని ఈ విషయాన్ని స్వయంగా అప్పటి విద్యుత్ శాఖ మంత్రి ఒప్పుకొన్నట్లు షర్మిల చెప్పారు. 'ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కూడా ఎలాంటి ప్రజాభిప్రాయం సేకరించకుండా, అదే కంపెనీ ఇతర రాష్ట్రాల్లో చేసుకున్న ఒప్పందాలను పరిశీలించకుండా వెంటనే ఆమోద ముద్ర వేశారు. అర్ధరాత్రి హడావుడిగా చేసిన అనుమతుల వెనుక దర్యాప్తు జరగాలి. అత్యవసరంగా సోలార్ పవర్‌ను కొనాల్సిన అవసరం ఏమొచ్చిందో, నిజానిజాలు ఏంటో రాష్ట్ర ప్రజలకు తెలియాలి. అదానీతో ఒప్పందాల రద్దుతో పాటు కంపెనీని తక్షణమే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి. అలాగే 2019 నుంచి 2024 మధ్య అదానీతో జరిగిన ఒప్పందాల మీద పూర్తిగా విచారణ జరగాలి. అని లేఖలో ప్రస్తావించారు. 'మన దేశం, రాష్ట్రం పరువు తీసేలా అంతర్జాతీయ మార్కెట్‌లో చర్చల మీద చర్చలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా మీ కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదు. ముడుపుల అంశంలో కనీసం మీరు నోరు విప్పడం లేదు. ఇప్పటికే అమరావతి ఇన్నర్ రింగ్ ప్రాజెక్టుతో పాటూ, రోప్‌వే నిర్మాణం, బీచ్ శాండ్ ఉత్పత్తుల ప్రాజెక్టులు, కొత్తగా సోలార్, హైడ్రో పవర్ ప్రాజెక్టులు అదానీకి కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సీఎం గారిని డిమాండ్ చేస్తున్నాం. ముడుపుల వ్యవహారంలో అదానీ కంపెనీ చేసే కుట్ర ఏంటో తేటతెల్లం అయ్యింది. అమెరికా దర్యాప్తు సంస్థల ద్వారా అసలు విషయం బయటపడ్డాక మళ్లీ మీరు కూడా ఆ కంపెనీతోనే ముందుకు వెళ్తారా లేక రాష్ట్రంలో అదానీ గ్రూప్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతారా తేల్చుకోవాలి. గంగవరం పోర్టు అదానీకి అమ్మడంపైనా విచారణ జరగాలి. గంగవరం పోర్టు తక్కువ ధరకు కట్టబెట్టడం వెనుక దాగి ఉన్న మర్మమేంటో కూటమి ప్రభుత్వం బయట పెట్టాలి. 2008న అప్పటి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం గంగవరం పోర్ట్ తిరిగి ప్రభుత్వపరం అయ్యేలా చర్యలు చేపట్టాలని లేఖలో పేర్కొన్నారు.

## అదానీతో ఒప్పందాలన్నీ రద్దు చేయాలి

హైదరాబాద్ నవంబర్ 25 (నిఘా న్యూస్): సీఎం తీసుకున్న ఈ నిర్ణయం పై మాజీ మంత్రి , బిఆర్ఎస్ నేత హరీష్ రావు స్పందించారు.స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి..? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని , ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికి రాగానే మాట మార్చేశారని , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ ప్రకటించిన 100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ పెడుతామనే ప్రతిపాదనతో వస్తే, మర్యాదపూర్వకంగా కలిసి చాయ్ తాగించి పంపించేశామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు పాటించిందని తెలిపారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు అన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికి రాగానే మాట మార్చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజలు తిరస్కరించినోళ్లు పార్లమెంటులో గుండాయిజం చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి...

అధికార, విపక్ష సభ్యులను మోదీ కోరారు.ప్రస్తుతం మనం 2024 ను పూర్తి చేసుకోబోతున్నాం అని అన్నారు. పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి చేశారు. విపక్షాలను టార్గెట్ చేస్తూ పార్లమెంట్‌లో చర్చకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇది 2024 సంవత్సరానికి చివరి కాలం' అని ప్రధాని అన్నారు. 2025 కోసం దేశం సిద్ధమవుతోంది. ఈ పార్లమెంట్ సమావేశాలు ఎన్నో అంశాలపరంగా ముఖ్యమైనవి. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి ఈ నవంబరు 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగు పెడుతున్నాం. దానికి గుర్తుగా సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుందాం అని మోదీ మీడియాతో మాట్లాడారు. ప్రజల చేత తిరస్కరణకు గురైన కొందరు వ్యక్తులు, కొందరి చేత గూండాయిజం చేయించి, పార్లమెంట్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి చర్యలను దేశ ప్రజలంతా చూస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారు చూస్తూ ఊరుకోరు. అయితే ఇక్కడ బాధించే విషయం ఏంటంటే పార్టీలతో సంబంధం లేకుండా కొత్తగా పార్లమెంట్‌కు ఎన్నికైన వారు కొత్త ఆలోచనలతో వస్తుంటారు. కొందరి గందరగోళ చర్యల వల్ల కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం రావడం లేదు. వారు ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవించరు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోరు. వారికి ప్రజలపై ఎలాంటి బాధ్యత ఉండదు. అందుకే వారు ప్రజల అంచనాలను ఎన్నటికీ అందుకోలేరని మోదీ సభా కార్యకలాపాలు సాగనివ్వని వారి తీరును ఆక్షేపించారు. ప్రపంచం ఇప్పుడు మనల్ని ఎంతో ఆశావహ దృక్పథంతో చూస్తోంది. ఆ గౌరవం పెంపొందేలా సభలో మన ప్రవర్తన ఉండాలి. పార్లమెంట్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉంది. దానికి అనుగుణంగా మనం నడుచుకోవాలి. వివిధ అంశాలను సరైన రీతిలో సభలో ఎత్తిచూపడం ద్వారా మనం వారి ఆకాంక్షలను నెరవేర్చగలం. దానినుంచి రాబోయే తరాలు ప్రేరణ పొందుతాయి. ఈ సెషన్ ఫలవంతంగా ఉంటుందని ఆశిస్తున్నాను. ఈ సమావేశాలను ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లాలని ఎంపీలందరినీ కోరుతున్నానని మోదీ అన్నారు. దేశం 2025ని పూర్తి ఉత్సాహంతో, ఉత్సాహంతో స్వాగతించేందుకు సిద్ధమవుతోంది. ఈ పార్లమెంటు సమావేశాలు అనేక విధాలుగా ప్రత్యేకమైనవి. ఇప్పుడు అతిపెద్ద విషయం ఏమిటంటే, మన రాజ్యాంగం 75 సంవత్సరాల ప్రయాణం, 75వ సంవత్సరంలోకి ప్రవేశించడం ప్రజాస్వామ్యానికి మంచి అవకాశమని గుర్తు చేశారు. రాజ్యాంగం 75వ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించడానికి రేపు అందరూ రాజ్యాంగ పరిషత్‌లో కలిసి రావాలని ప్రధాని కోరారు. మహారాష్ట్ర, యూపీలో బంపర్ విజయం సాధించిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారి పార్లమెంట్ సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించారు. శీతాకాల సమావేశాలు కావడంతో వాతావరణం చల్లగా ఉంటుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. విపక్షాలపై విరుచుకుపడిన ప్రధాని మోదీ, కొద్దిమంది వ్యక్తులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ప్రస్తావించారు. ఆ వ్యక్తులు తమ బాధ్యతలను అస్సలు పట్టించుకోవడం లేదన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ గూండాయిజంతో పార్లమెంట్‌ను అదుపు చేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమని ప్రధాని మోదీ అన్నారు. వారు పార్లమెంటులో చర్చకు అనుమతించరు. పార్లమెంటు కార్యకలాపాలను ఆపడమే వారి సొంత లక్ష్యమని ఎద్దేవా చేశారు ప్రధాని మోదీ. కానీ దేశ ప్రజలు వారి ప్రవర్తనను పట్టించుకోరని, సమయం వచ్చినప్పుడు ప్రజలు వారిని శిక్షిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పార్లమెంటులో ఆరోగ్యకరమైన చర్చ జరగాలని సూచించారు. సాంప్రదాయం ప్రకారం సమావేశాల మొదటి రోజు, ప్రధాని మోదీ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రసంగించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు, లోక్‌సభ, రాజ్యసభల 19%-%9 సమావేశాలు జరుగుతాయి. వక్ఫ్ (సవరణ) బిల్లుతో సహా 16 బిల్లుల జాబితాను ప్రభుత్వం సెషన్‌లో పరిశీలనకు సిద్ధం చేసింది. లోక్‌సభలో ఎనిమిది, రాజ్యసభలో రెండు బిల్లులు పెండిరగ్‌లో ఉన్నాయి. ఈ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం పలు ముఖ్యమైన బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించేందుకు ప్రయత్నిస్తుంది. గత సెషన్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టిన బ్యాంకింగ్ నిబంధనల (సవరణ) బిల్లు, రైల్వే (సవరణ) బిల్లు ఇందులో ఉన్నాయి. కానీ వాటిని పాస్ చేయలేక పోయారు. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ ఆమోదం పొందిన ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

## ఔట్ సోర్సింగ్‌కు ప్రాజెక్టులు రోడ్ల నిర్మాణం, నిర్వహణ

మొదటి పేజీ తరువాయి...

టోల్‌గేట్లు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు సిఎం తెలిపారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తానే పిపిపి పద్ధతిలో జాతీయ రహదారుల అభివృద్ధి ప్రతిపాదన చేశానని అప్పట్లో తనను అందరూ వ్యతిరేకించారని, కానీఇప్పుడు దేశ వ్యాప్తంగా నాలుగు, ఆరు, ఎనిమిది, 14 లైన్ల జాతీయ రహదారులు కూడా వచ్చాయన గుర్తు చేసుకున్నారు. గోదావరి నీటిని పెన్నాకు తరలించడానికి నదుల అనుసంధాన ప్రాజెక్టును చంద్రబాబు పరిశీలిస్తున్నారు. కృష్ణా నదికి తరలించిన గోదావరి మిగులు జలాలను ప్రకాశం బ్యారేజీ సమీపంలోని వైకుంఠపురంకు తరలిస్తారు. అక్కడ ప్రకాశం బ్యారేజీ తరహాలో బ్యారేజీ నిర్మిస్తారు. అక్కడి నుంచి బొల్లాపల్లికి తరలించేలా ప్రణాళిక రూపొందించారు. బొల్లాపల్లి రిజర్వాయరు నుంచి నల్లమల మీదుగా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు గోదావరి జలాలను తరలించేలా జల వనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల 22 టీఎంసీలను వెలిగొండ ప్రాజెక్టుకు సరఫరా చేయవచ్చని చెబుతున్నారు. ఇక బనకచర్ల కాంప్లెక్స్ నుంచి తెలుగు గంగ, గాలేరు%-%నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు 140 టీఎంసీలను తరలించవచ్చని భావిస్తున్నారు. మొత్తంగా బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు 180 టీఎంసీల గోదావరి జలాలను తరలించే వీలుంది. ఈ ప్రాజెక్టు చేపట్టాలంటే రూ.70 వేల కోట్లు కావాలి. అంత మొత్తం ప్రభుత్వం వద్ద ఉండదు. అందుకే చంద్రబాబు పీపీపీ మోడల్ గురించి ఆలోచిస్తున్నారు. రోడ్లు, ప్రాజెక్టులు ప్రైవేటు, ప్రభుత్వ పార్టనర్ షిప్‌లో ప్రాజెక్టుల్ని నిర్మిస్తారు. ఆ ప్రాజెక్టు ద్వారా ఆయా కంపెనీలు ఆదాయం సంపాదించుకునే మార్గాలు చూపిస్తారు. టోల్ వసూలు చేస్తారా నీటి తీరువా వసూలు చేస్తారా మరొకటా అన్నది తర్వాత. రైతుల పంటలకు కావాల్సినంత నీరు సదుపాయం వస్తే, అంత కంటే కావాల్సిందేమీ ఉండదని అంచనా వేస్తున్నారు.పీపీపీ విధానంతో ఏపీని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు ఎన్నికలకు ముందు నుంచీ చెబుతున్నారు . ప్రజల ఆదాయాలను పెంచితే వారు ఈ విధానం ద్వారా మేలు జరిగితే ఎంతో కొంత పన్నులు కట్టేందుకు సిద్ధంగా ఉంటారు. మేలు జరగకపోతే మాత్రం ప్రజా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది.ం

## హిందూ ముస్లింల మధ్య వివక్ష... దేశానికి ప్రయోజనకరం కాదు

న్యూఢిల్లీ నవంబర్ 25 (నిఘా న్యూస్): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంభాల్ కాల్పుల ఘటనపై సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. సంభాల్ కాల్పుల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత తొందరపాటు వైఖరి అత్యంత దురదృష్టకరమని అన్నారు. హింస కాల్పుల్లో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతి అని రాహుల్ అన్నారు. "అన్ని పార్టీల మాట వినకుండా పరిపాలన యొక్క అసంబద్ధమైన చర్య పరిస్థితిని మరింత దిగజార్చింది. ఈ ఘటనచాలా మంది మరణానికి దారితీసింది. దీనికి బిజెపి ప్రభుత్వమే ప్రత్యక్ష బాధ్యత వహిస్తుంది" అని రాహుల్ గాంధీ అన్నారు. తక్షణమే జోక్యం చేసుకుని న్యాయం జరిగేలా సుప్రీంకోర్టును ఆశ్రయించాలని కాంగ్రెస్ నేత కోరారు. హిందూ-ముస్లిం వర్గాల మధ్య చీలికలు, వివక్ష సృష్టించేందుకు బీజేపీ అధికారాన్ని వినియోగించుకోవడం రాష్ట్రానికి గానీ, దేశానికి గానీ ప్రయోజనం కలిగించదని, వీలైనంత త్వరగా ఈ విషయంలో జోక్యం చేసుకుని న్యాయం చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. "శాంతి పరస్పర సామరస్యాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశం ఐక్యత, రాజ్యాంగపు బాటలో ముందుకు సాగేలా చూసేందుకు మనమందరం కలిసి చేరాలి, మతతత్వం, ద్వేషం కాదు అన్నారాయన. ఆదివారం సంభాల్‌లో జామా మసీదు సర్వేను వ్యతిరేకిస్తున్న ఆందోళన కారులు భద్రతా బలగాలతో ఘర్షణల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ప్రధాని విశాఖ పర్యటన రద్దు

మొదటి పేజీ తరువాయి...

వాతావరణ హెచ్చరికలతో మోదీ పర్యటన రద్దు అయినట్లు పీఎంవో తెలిపింది. అనకాపల్లి పూడిమడకలోని ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపనతో పాటు జాతీయ రహదారుల అంకితం, కొన్ని రైల్వే ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయాల్సి ఉంది. ఈ పర్యటనలో భాగంగా విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ స్టేడియంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ సైతం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, తీవ్ర వాయుగుండంగా మారుతోంది. అనంతరం అది తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు చేసినట్లు ప్రధాని కార్యాలయం సోమవారం వెల్లడించింది.

## తెలంగాణలో అంబర్ పెట్టుబడులు రూ.250 కోట్లు

హైదరాబాద్ నవంబర్ 25 (నిఘా న్యూస్): తెలంగాణలో మరో కంపెనీ పెట్టుబడులకు సిద్ధమైంది. పెట్టుబడులతో పాటు మరో వెయ్యి మందికి ఉపాధి కలగనుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ వినియమ వస్తువులు, విడి భాగాలు అందించే అంబర్-రెసోజెట్ భాగస్వామ్య సంస్థ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చనట్లు మంత్రి తెలిపారు. పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ వినిమయ వస్తువులు, విడిభాగాలు అందించే అంబర్- రెసోజెట్ భాగస్వామ్య సంస్థ రాష్ట్రంలో రూ.250 కోట్ల పెట్టుబడులతో ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. సోమవారం ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో సంస్థ ప్రతినిధులు తమ పెట్టుబడుల ప్రణాళికను వెల్లడిరచారు. అంబర్- రెసోజెట్ సంస్థకు ప్రభుత్వ పరంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వెల్లడిరచారు. ఈ సంస్థ దేశంలోని పలు కంపెనీల కోసం రూమ్ ఏసీలు, అత్యాధునిక వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, పారిశ్రామిక ఎయిర్ కండిషనర్ల లాంటి పలు పరికరాలకు ఉత్పత్తి చేసి అందిస్తోందని ఆయన తెలిపారు. వచ్చే మూడేళ్లలో రూ.250 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పుతుందని శ్రీధర్ బాబు చెప్పారు. దీని వల్ల ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే అత్యాధునిక ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పిసిబి) ల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని శ్రీధర్ బాబు వెల్లడిరచారు. వందేభారత్ రైళ్లు, మెట్రో రైళ్ల ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలతో పాటు, బస్సులు, డిఫెన్స్ వాహనాలు, పారిశ్రామిక అవసరాలకు ఎయిర్ కండిషనర్ల తయారీలో అంబర్ ఎంటర్ ప్రైజెస్ కు మంచి పేరుందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి యూనిట్లు ఉన్న అంబర్ తాజాగా హైదరాబాద్ ను గమ్యస్థానంగా ఎంచుకున్నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీజీఐఐసీ ఎండీ డా. ఇ. విష్ణువర్ధన్ రెడ్డి, సిఇఓ మధుసూదన్, డైరెక్టర్ ఎలక్ట్రానిక్స్ డా. ఎస్ కె శర్మ, అంబర్, రెసోజెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహా పీఠంపై వీడని ఉత్కంఠ

మొదటి పేజీ తరువాయి...

'మహా వికాస్ అఘాడి'కి రాలేదని చెప్పారు. 'ఏ ఫార్ములాపై చర్చ జరగడం లేదు. మేము ముగ్గురూ (కూటమి) కలిసి సీఎం పదవిపై చర్చిస్తాం. అసెంబ్లీలో ఎన్సీపీ నేతగా నన్ను ఎన్నుకున్నారు. శివసేన తరఫున ఏక్‌నాథ్ షిండే ఎన్నికయ్యారు. బీజేపీ కూడా ఇదే చేసింది. మేము కలిసి చర్చించుకుని సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం అని అజిత్ పవార్ తెలిపారు. సీఎం రేసులో బీజేపీ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ముందంజలో ఉన్నారు. బీజేపీ పోటీ చేసిన 149 స్థానాల్లో 132 స్థానాలను ఆ పార్టీ గెలుచుకోవడంతో ఫడ్నవిస్‌కు మూడోసారి సీఎం పగ్గాలు అప్పగిస్తారనే వాదన బలంగా ఉంది. మరోవైపు సీఎం రేసులో ఏక్‌నాథ్ షిండే ఉన్నారని ఆ పార్టీ నేత సంజయ్ షిర్‌సత్ తెలిపారు. సీఎం ఎవరనేది అంతిమంగా ఢిల్లీలో నిర్ణయిస్తారని, చర్చలు జరుగుతున్నందున ఫలితం ఏమిటనేది వేచిచూడాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు కూడా జరగాల్సి ఉన్నందున దానిని కూడా సీఎం ఎంపిక విషయంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మంగళవారానికి ఒక స్పష్టత వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

### ఢిల్లీలో కీలక సమావేశం

సీఎం పీఠంపై తలెత్తిన ప్రతిష్ఠంభనను తొలగించేందుకు ఢిల్లీలో సోమవారం 'మహాయుతి' అగ్రనేతలతో సమావేశం ఏర్పాటైంది. హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సైతం హాజరవుతున్నారు. సమావేశానంతరం కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

## తెలంగాణలో పెరిగిన చలి

మొదటి పేజీ తరువాయి...

భయపెడుతోంది. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు రెండూ దారుణంగా పడిపోయాయి. రాత్రి చలి వణికిస్తుంటే ఉదయం పొగమంచు మరింత భయపెడుతోంది. వాహనదారులు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. చలి, పొగమంచు కారణంగా కాలుష్య తీవ్రత కూడా హైదరాబాద్‌లో విపరీతంగా పెరిగిపోయింది. కాగా తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షావరణం ఉంటే తెలంగాణలో మాత్రం ఎముకలు కొరికే చలి ఇబ్బంది పెడుతోంది. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం చలి తీవ్రత పెరిగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారనుంది. అనంతరం ఇది వాయవ్య దిశగా కదులుతుంది. తమిళనాడు శ్రీలంక తీరం వైపునకు వెళ్లి అక్కడ మరింత బలపడబోతోంది. ప్రస్తుత అల్పపీడన ప్రభావం కొంత వరకు కోస్తాంధ్రపై కనిపిస్తోంది. ఆకాశం మబ్బులు పట్టి ఉంది. ఇది వాయుగుండంగా మారితే బుధవారం నుంచి శనివారం వరకు వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. శ్రీలంక సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్న అల్పపీడనం దక్షిణ కోస్తాపై ప్రభావం చూపబోతోంది. ఈ సాయంత్రం నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. దక్షిణ కోస్తాతోపాటు రాయలసీమపై కూడా ప్రభావం ఉంటుంది. వర్షపు జల్లులు కురిసే అవకాశం ఉంది. వర్షాలతోపాటు బలమైన గాలులు కూడా వీస్తాయి. దీంతో చలి తీవ్రత మరింతగా పెరగొచ్చు. సముద్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులు కారణంగా మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు.

# ఇతర పార్టీలను గెలిపిస్తే అభివృద్ధి కుంటుపడుతుంది

- నాలుగేళ్లు మేమే అధికారంలో ఉంటాం
- 30వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**పెబ్బేరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్న వనపర్తి నియోజకవర్గ ప్రజల ఇంటిబిడ్డగా పనిచేస్తానని, నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా పాటుపడతానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాడు కేవలం 67 వేల కోట్ల రూపాయల అప్పు మాత్రమే ఉండిందని,10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలన తర్వాత 7 లక్షల 20 వేల కోట్ల రూపాయల అప్పులు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఎమ్మెల్యే అన్నారు.నాడు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సెక్రటేరియట్ కు రాకుండానే పాలన కొనసాగించేవాడని, నేడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతూ ఎల్లవేళలా సెక్రెటరీ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయంలో అట్టి అప్పుకు వడ్డీ కడుతూనే రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి పాటుపడుతున్నారని ఆయన అన్నారు. 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో వనపర్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని చెరువులు కట్టలు అంటూ దోచుకున్నారే తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు చేయలేదని ఎమ్మెల్యే విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డును ఇవ్వబోతుందని దాంతో అన్ని రకాల ప్రభుత్వ సేవా పథకాలను మనం పొందవచ్చునని ఆయన అన్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చి ఇళ్లల్లో ఉన్న అన్నదమ్ముల మధ్య భూ తగాదాల చిచ్చు రగిలించిందని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం భూమాత పేరుతో భూ సంబంధిత సమస్యలన్నిటిని పరిష్కరిస్తుందని ఆయన వివరించారు. నాలుగు సంవత్సరాల వరకు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని లోకల్ బాడీ ఎన్నికల్లో సర్పంచ్ ఎంపీటీసీ కౌన్సిలర్ జెడ్ పి టి సి లు అందరూ కాంగ్రెస్ పార్టీ వారే ఉండాలని కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఇచ్చిన ప్రతి ఒక్కరిని గెలిపించాలని ఎమ్మెల్యే సూచించారు. ఇతర పార్టీల అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి కుంటుపడుతుందే తప్ప ముందుకెళ్లదని దయచేసి ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే విధంగా పాటుపడాలని ఆయన సూచించారు. ఈ నెల 30వ తేదీన మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వస్తున్నారని ఇట్టి మీటింగును విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.అమృత్ స్కీం ద్వారా వనపర్తి నియోజకవర్గంలో 73 కోట్ల రూపాయలతో తాగునీటి అదనపు నిర్మాణాలను చేపడుతున్నామని దాంతో భవిష్యత్తు 25 సంవత్సరాల వరకు తాగునీటి సమస్య రాకుండా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 379 మంది కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు 3,79,43,964 కోట్ల రూపాయల విలువగల చెక్కులను అందజేశారు. అదేవిధంగా 229 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు 44,91,500 లక్షల రూపాయల విలువగల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్,వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్, పాకనాటి కృష్ణయ్య,వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్, వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్,మాజీ ఎంపీపీ శంకర్ నాయక్ మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రభుత్వ అధికారులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు సింగిల్ డైరెక్టర్లు అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మానసాదేవి హెూమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన

### హాజరైన నటుడు సుమన్, మాడుగుల నాగఫణి శర్మ



**కుత్బుల్లాపూర్, 25 నవంబర్ (నిఘా న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ ప్రగతి నగర్ లో పట్టాభి రామాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణములోని గౌరీ శంకర స్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మానసాదేవి హెూమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ నాయకులు కూన శ్రీశైలం గౌడ్, మాడుగుల నాగఫణిశర్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు సుమన్, పిసిసి ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి, సెక్రెటరీ ధనరాజ్ యాదవ్, అరవింద్ వెంకట్ రెడ్డి, రంగారెడ్డి రాములు, రవీందర్, తులసీదాస్, ఉమా,జయ వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాల ధరించిన బిజెపి నాయకులు



**మనోహరాబాద్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కళ్ళకల్ గ్రామ బిజెపి నాయకులు నత్తి మల్లేష్ వీరి కుల దైవం, తల్లిదండ్రుల ఆశీర్వాదంతో గురుస్వాముల సమక్షంలో బొల్లారం శ్రీ శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారణ చేసుకున్నరు. బిజెపి నాయకులు మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్ ఏర్పాటు చేసిన మండల దీక్షలో వీరితోపాటు వీరి కుటుంబ సభ్యులు ఈ మాలధారణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల రెండు వేల నాలుగు నుండి రెండు వేల తొమ్మిది వరకు సివిల్ లో కేరళలో అయ్యప్ప దర్శనానికి వెళ్లడం జరిగింది. రెండు వేల పది నుండి మండల దీక్ష చేపట్టి అయ్యప్ప సేవలో తరించడం జరిగిందన్నారు.

## విత్తనం.. క్రయవిక్రయాల్లో జాగ్రత్తలు అవసరం

### మండల వ్యవసాయ శాఖ అధికారి షాహిక్ మున్నా



**పెబ్బేరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** విత్తనం క్రయవిక్రయాల్లో జాగ్రత్త అవసరమని మండల వ్యవసాయశాఖ అధికారి షాహిక్ మున్నా విత్తనాలు అమ్మే డీలర్లకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. పెబ్బేరు పట్టణ కేంద్రంలో ఉన్న మన గ్రోమోర్ సెంటర్, మల్లికార్జున పర్టిలైజర్స్,మహేష్ ట్రేడర్స్ అన్నపూర్ణ ట్రేడర్స్ నందిని ట్రేడర్స్ తదితర విత్తన విక్రయ కేంద్రాలను మండల వ్యవసాయశాఖ అధికారి షాహిక్ మున్నా సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన దుకాణాల్లో ఉన్న విత్తనాల స్టాక్ వివరాలను, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. అదేవిధంగా విత్తనాలకు సంబంధించిన బిల్లు బుక్కులను, డెలివరి చలాన్లను, మార్కెటింగ్ అగ్రిమెంట్, వచ్చిన స్టాక్, అమ్మిన స్టాక్ వాటి లెక్కలను గమనించారు.ఈ సందర్భంగా విత్తనాలు అమ్మే డీలర్లకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. చలి ఉన్నందున రైతులకు రెండు రోజుల విత్తనము ఎండిన తర్వాత విత్తనం నాన పెట్టవలెనని రైతులకు ముందు జాగ్రత్తలు చెప్పి విత్తనములను ఇవ్వవలసిందిగా తెలిపారు.

## పేద మహిళలకు చీరల పంపిణీ

### బాద నరేష్ చేతుల మీదుగా అందజేత



**ముస్తాబాద్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చీకోడ్ గ్రామం బాద నరేశ్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరల పంపిణీ చేయడం జరిగింది. మండలంలోని గూడెం గ్రామ వాస్తవ్యులు చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు కుమారుల పుట్టిన రోజును పురస్కరించుకొని వారి సహకారంతో పేద మహిళలకు చీరలు పంపిణీ చేసిన సందర్భంగా బాద నరేష్ హర్షం వ్యక్తం చేశారు. ముస్తాబాద్ మండలంలోని పేదవారికి వారు చేస్తున్న సేవలను ఎప్పటికీ మర్చిపోలేని చీకోడ్ గ్రామ ప్రజల తరపున నరేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మాదవి వెంకటేశ్వరరావు కుమారులు సాయిరాం, అభినవరావు పుట్టినరోజు సందర్భంగా వారు కలకాలం ఆయురారోగ్యాలతో ఉండి పేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ మండలం ప్రధాన కార్యదర్శి గున్నాల రమేష్ గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షులు ఊరది రాజు యాదవ్,కోటగిరి దేవేందర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక సోమవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు



**ముస్తాబాద్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** పరమ శివుడికి సోమవారం ప్రీతికరమైన వారం. సోమ అంటే, స - ఉమ అనే అర్థం ఆవిష్కరించబడుతోంది. స- ఉమ అంటే ఉమతో కూడినవాడుగా శివుడు చెప్పబడుతున్నాడు.ఈ కారణంగానే సోమవారం రోజున చేసే పూజలు శివుడికి ప్రీతిని కలిగిస్తాయని అంటారు. ఈ నేపథ్యంలో కార్తీక మాసంలోని సోమవారాలు మరింత విశేషాన్ని కలిగినవిగా కనిపిస్తుంటాయి భక్తిశ్రద్ధలతో శివున్ని కొలిస్తే మాంగల్య భాగ్యం చేకూరుతుందని విశ్వాసం.కార్తీక సోమవారాల్లో సూర్యోదయానికి ముందుగానే తలస్నానం చేసి, పూజా మందిరాన్ని అలంకరించి భక్తిశ్రద్ధలతో శివలింగాన్ని అభిషేకించి, బిల్వ దళాలతో అర్చించడం జరుగుతుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామం శివ కేశవ ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కనపర్తి ఉమాదేవి -రాజేంద్రచారి మనవడు చిరంజీవి గౌరీ శంకర్ సాక్షాత్తు బాలశివుడే ప్రత్యక్షమై అభిషేకం చేసినట్లుగా భక్తులకు కనువిందు కలిగించింది.ఈ సందర్భంగా పూజారి శివచరణ్ మాట్లాడుతూ శివుడిని బిల్వ దళాలతో పూజించడం వలన మనోభీష్టం నెరవేరుతుందని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయని పేర్కొన్నారు పరమశివుడికి ఇష్టమైన పాయసాన్ని ఈ రోజున నైవేద్యంగా సమర్పించాలి.ఆ పాయసాన్ని ప్రసాదంగా స్వీకరించడం వలన కష్టాలు తొలగిపోతాయని స్పష్టంచేయబడుతోంది. ఈ రోజున శివాలయానికి వెళ్లి స్వామివారి సన్నిధిలో కార్తీక దీపాన్ని వెలిగించాలన్నారు. ఈ విధంగా శివాలయంలో దీపాన్ని వెలిగించడం వలన సమస్త దోషాలు నశిస్తాయి. ఉపవాస దీక్షను చేపట్టి ఈ నియమాలను పాటిస్తూ ఈశ్వరుడిని ఆరాధించడం వలన మోక్షానికి అవసరమైన అర్హతను పొందడం జరుగుతుంది. ఆదిదేవుడి అనుగ్రహాన్ని పొందాలనుకునే వాళ్లు, కార్తీక మాసంలో చివరి సోమవారాన్ని తప్పక ఉపయోగించుకోవాలి. ఆ రోజంతా సదాశివుడి సేవలో తరించాలని పూజారి తెలిపారు.

## బిబిజే నెట్వర్క్ ఆధ్వర్యంలో డీఎస్పీ గంగాధర్ కు సన్మానం




**హైదరాబాద్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** పే బ్యాక్ టు ద సొసైటీ రూపంలో ఎన్నో కార్యక్రమాలకు, ఎంతోమంది విద్యార్థులకు వారి భవిష్యత్తు కొరకు తన వంతు సహకారాలు అందించిన డీ.ఎస్.పీ మధనం గంగాధర్ కు ఆత్మీయ సన్మాన సభ సోమవారం లక్డికాపూల్ లో కెఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో బీబీజే నెట్వర్క్ వ్యవస్థాపకుడు డాక్టర్ కళ్లెం అంజనేయులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తన డిఎస్పి పదవికి మధనం గంగాధర్ విఆర్ఎస్ తీసుకొని ప్రజా క్షేత్రంలోకి రావడం రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిలబడడం గొప్ప పరిణామం అని కొనియాడారు. బిబిజే నాయకులు మాట్లాడుతూ మధనం గంగాధర్ కు తమ వంతు మద్దతు ఉంటుందని, ఆయన సేవలను కొనియాడారు. తన గెలుపు కోసం కృషి చేయాల్సిన బాధ్యత యావత్తు పట్ట భద్రులపై ఉందన్నారు. మదనం గంగాధర్ మాట్లాడుతూ సమాజంలో ఒక మంచి ఐడియాలజీతో గొప్ప మార్పు కోసమే రాజకీయాల్లోకి వస్తున్నానని తెలిపారు. పరిమితమైన సేవల నుండి అపరిమిత సేవలు చేయడానికి విఆర్ఎస్ తీసుకున్నానని చెప్పారు. ఈ సన్మాన సభలో ప్రోగ్రాం చీఫ్ కో-ఆర్డినేటర్ కళ్యాణం శరత్ చంద్ర, బీబీజే నాయకులు డా.ఎన్ఆర్ వెంకటేశం, సిరిగిరి మన్నెం, కోడిగంటి నరసింహ, సిరిపాటి వేణు, కడమంచి సహదేవుడు, గగనం మన్నెం, పోవనపు బాల నరసింహ, మేధావులు మోతే శివశంకర్, కళ్యాణం నరసింహ, చిత్తారి అనంతయ్య, నిదానకవి జయమ్మ, కళ్యాణం ధనుంజయుడు, చింతల యాదగిరి, రాసూరి శివరాజ్, యూత్ నాయకులు కడమంచి చెన్నయ్య, పసుపుల రాజేష్, కడమంచి శివ, డా.సిరిసిరి గురుస్వామి పాల్గొన్నారు.

## దైవ చింతనతో మనశ్శాంతి.. గురు స్వామి రామచంద్ర చారి



**పెద్ద శంకరంపేట, నవంబర్ 25 (నిఘా న్యూస్):** పెద్ద శంకరంపేట పరిసర ప్రాంతాలో రోజురోజుకు అయ్యప్ప దీక్ష పరులు పెరుగుతూ ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అయ్యప్ప దీక్షా సమయం రాగానే ఈ ప్రాంతంలో ముఖ్యంగా యువకులు అయ్యప్ప దీక్ష తీసుకుని మండలం పాటు ఎంతో భక్తి రౌతులతో పూజలు చేస్తూ సమాజానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ మెప్పును పొందుతున్నారు. ఆకులను కార్తీక మాసం 13వ తేదీ నుండి పెద్ద శంకరంపేట పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఉపాలయంలో నేటి వరకు దాదాపు 95 మంది యువకులు అయ్యప్ప మాలలు ధరించి పూజలు నిర్వహిస్తున్నారు సోమవారం 38 మంది స్వాములు రామచంద్రాచారి గురుస్వామి చేతులు మీదుగా అయ్యప్ప మాలలు ధరించి దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా గురు స్వామి రామచంద్ర చారి మాట్లాడుతూ అయ్యప్ప మాలలు ఏ ప్రాంతంలోనైనా వయసు ఎక్కువ ఉన్నవారు ధరిస్తూ ఉంటారని కానీ శంకరంపేట ప్రాంతంలో ముఖ్యంగా యువత మాల ధారణకు ముందుకు రావడం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టం అని పేర్కొన్నారు. నేడు యువత ఎన్నో చెడు అలవాట్లకు బానిసై వారి జీవితాలను పాడు చేసుకుంటున్నారని కానీ ఈ ప్రాంత యువకులు అయ్యప్ప శివ మాలలు వేసి ఆధ్యాత్మిక చింతనతో ఉంటూ సమాజానికి ఇతోధికంగా తోడ్పడుతున్నారని అన్నారు. సోమవారం మాల అంతరించిన స్వాములలో రాములు గురు స్వామి శ్రీహరి గురుస్వామి బసవరాజు గురుస్వామి తోపాటు అయ్యప్ప కన్ని కత్తి గంట పెరు స్వాములు ఉన్నారు.

## వికలాంగులకు కొత్త పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

### వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నేత అమ్ముల బాల్ నర్సయ్య




**సిద్దిపేట, నవంబర్ 25 (నిఘా న్యూస్):** తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వికలాంగులకు ఇస్తున్న నాలుగు వేల పెన్షన్ కు అదనంగా మరో రెండు వేలు జోడించి ఆరు వేల రూపాయలను ఇస్తాన్నన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే వికలాంగులను విస్మరించడం సరికాదని సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండల పరిధిలోని దుద్దెడ శివారులో ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్టీఆర్ డి జిల్లా నాయకులు అమ్ముల బాల్ నర్సయ్య వికలాంగులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా వాణి కార్యక్రమంలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాల్ నర్సయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామిలను విస్మరించకుండా అమలు చేసి కొత్త పెన్షన్ విధానానికి రూపకల్పనా చేపట్టి వికలాంగులకు ఆరు వేల రూపాయలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఎన్ పి ఆర్ డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ టి ఆర్.డి.నాయకులు తన్నీరు సాయిలు, కొమరవెల్లి నరసింహులు,కోరే శ్రీనివాస్ మైసయ్య,బాలలక్ష్మి, పుష్ప మల్లికార్జున్, మధు,రాజయ్య, నవీన్, బాబు కవిత, శ్రీధర్ రాజు, రాములు, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన జంట కుటుంబాన్ని.. ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



**తూప్రాన్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని కంటయపాలెం వేణుగోపాల్ కూతురు వివాహం ఈనెల 14న జరిగింది. ఇందుకుగాను కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి వారి కుటుంబ సభ్యులను అభినందించారు. అనంతరం వేణుగోపాల్ మర్యాద పూర్వకంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## రక్తదానంతో మరొకరికి కొత్త జీవితం: ఎస్ఐ గఫార్



**తాండూరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** ఒక యువకుని రక్తదానం ఇతరుల జీవితాలను కాపాడుతుందని ఎస్ఐ గఫర్ వెల్లడించారు. ముస్తబా హెల్పింగ్ ఫౌండేషన్ ఫౌండర్ ముస్తఫా అహ్మద్ సూచనల మేరకు ముస్తఫా హెల్పింగ్ ఫౌండేషన్ అధ్యక్షులు సిరాజుద్దీన్ అహ్మద్, ఉపాధ్యక్షులు రవీందర్ సింగ్, తాహేర్ బాండ్, అబ్దుల్ ఖదీర్ ఆధ్వర్యంలో బషీరాబాద్ మండల కేంద్రంలోని ముస్తఫా ఫౌండేషన్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ గఫర్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువకులు ముందుకు రావాలని కోరారు. ముస్తఫా ఫౌండేషన్ అధ్యక్షులు సిరాజుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ 22 మంది యువకులు రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగయ్య, మండల మాజీ కో ఆప్షన్ ఇసుబ్ ఖాన్, టిఆర్ఎస్ నాయకులు రాజు రెడ్డి, సునిల్ ప్రసాద్, వైద్య సిబ్బంది యువకులు పాల్గొన్నారు.

## దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి

### మున్సిపల్ చైర్ పర్సన్ పండుగల జయశ్రీ



**అబ్దుల్లాపూర్ మెట్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చైర్ పర్సన్ పండుగల జయశ్రీ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి 7వ వార్డులో స్థానిక వార్డు కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను చైర్ పర్సన్ ముఖ్యఅతిథిగా హాజరై వార్డు కౌన్సిలర్ తో కలిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని రోడ్డు పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సిద్ధంకి కృష్ణారెడ్డి, కమిషనర్ ఎస్.రవీందర్ రెడ్డి డిఈఈ శివానందం, కో ఆప్షన సభ్యులు కలీం, నాయకులు వడ్డేపల్లి విజయేందర్ రెడ్డి, బొర్ర సురేష్, దేశారం జగన్మోహన్ గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ చెరువులో చేప పిల్లలు వదిలిన నేతలు

### ముఖ్య అతిథి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**తూప్రాన్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని పెద్ద చెరువులో చేప పిల్లలు వదిలే కార్యక్రమానికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి హాజరైనారు. వారి చేతులతో లక్ష పైచిలుకు చెరువులో చేప పిల్లలను వదలడం జరిగింది. వీరితోపాటు కాంగ్రెస్ నాయకులు మత్స్యశాఖ చైర్మన్ గడప దేవేందర్, గజ్వేల్ నాయకులు భూమిరెడ్డి, ఎలక్షన్ రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ మామిళ్ల జ్యోతి ఉన్నారు. తూప్రాన్ బోయబస్తి కాలనీ వాసులు పాల్గొని విజయవంతం చేశారు.

## కుటుంబ నియంత్రణపై అవగాహన పెంచాలి

### జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకట రమణ



**వికారాబాద్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** కుటుంబ నియంత్రణను అనుసరించి భార్యాభర్తలు ఇద్దరికీ డాక్టర్లు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన జిల్లా కుటుంబ నియంత్రణ వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ వై.పవిత్ర ఆధ్వర్యంలో వెసెక్టమి పక్షోత్సవాల్లో భాగంగా డాక్టర్లతో, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వచ్చే వారం నుండి ట్యూబెక్ట్ మీ శస్త్ర చికిత్సలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని సూచించారు. ఈ కార్యక్రమంలో డెమో శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ రజిత, డాక్టర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## విశ్వకర్మ దేవాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



**రామంతాపూర్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** రామంతపూర్ లక్ష్మీనారాయణ కాలనీ లో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయ పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముళ్ళ పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ దేవాలయ పునర్నిర్మాణం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పసల లూకాస్ చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి ,ఆకారపు అరుణ్ ,బిక్షపతి చారి నాగేశ్వరరావు మధుబాబు కొక్కొండ బ్రహ్మచారి శ్రీధర్ ప్రసాద్ శ్రీహరి చారి, నామని నాగరాజు, వేణు, డాక్టర్ రాజు, యాదగిరి, హరి, పాండురంగ చారి, దశరథ చారి, నరేష్, నరసింహ చారి, వీరాచారి, నిరంజన్ రావు, బెస్త రవి, నర్మదా, జయ, పుష్పవతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మాలల సింహ గర్జనను విజయ వంతం చేయాలి



**వలిగొండ, నవంబర్ 25 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో హైదరాబాద్ లో పేరెడ్ గ్రౌండ్ లో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాల మహానాడు యాదాద్రి భువనగిరి జిల్లా సీనియర్ నాయకులు కుసంగుల రాజు, దొంత సత్యం, పెరమండ్ల యాదగిరి పిలుపు నిచ్చారు. సోమవారం వలిగొండ పట్టణ కేంద్రంలో సింహ గర్జన విజయవంతం కోసం ప్రచారం నిర్వహించి అనంతరం వాల్ పోస్టర్లను కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు రాపోలు పవన్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాదులో జరిగే మాలల సింహ గర్జనకు మాలలు వలిగొండ మండలం నుండి పెద్ద ఎత్తున తరలి హైదరాబాదులో జరిగే సభకు తరలిరావాలన్నారు జనాభా దామాష ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు వలిగొండ మండల కమిటీ ఉపాధ్యక్షుడు బుంగ శేఖర్ సహాయ కార్యదర్శి మొగిలి పాక కృష్ణ, రాపోలు రఘుపతి, కంచి రామలింగం, గోపి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య మృతికి నివాళులు

### ఇల్లందు మండల టిడిపి నాయకులు



**ఇల్లందు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** ఇల్లందు మాజీ శాసనసభ్యులు అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో స్వర్గస్తులైనారు. వారి స్వగ్రామం హనుమంతుల పాడుకు పార్థివ దేహం చేరుకోగా విషయం తెలుసుకొని ఇల్లందు టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టిడిపి మండల నాయకులు పుట్ట ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రెండుసార్లు ఇల్లందు నియోజక వర్గం నుండి పోటీచేసి అవకాశం కల్పించింది. 2009లో తెలుగుదేశం పార్టీ నుండి ఇల్లందు ఎమ్మెల్యేగా ఊకె అబ్బయ్య గెలిచారు. గిరిజన ప్రాంతంలో అనేక పోరాటాలు గిరిజనులు, ఎస్సీ. బీసీల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. కార్మిక నాయకుడిగా. సర్పంచ్ గా. మూడు మార్లు ఎమ్మెల్యేగా అనేక సేవలు అందించారు.ఎంత ఎదిగిన ఒదిగుండే మనస్తత్వం ఆయనది అన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్ట ఉపేందర్ యాదవ్ క్లింట్ రోజ్, సీనియర్ నాయకులు మారపల్లి కుమారస్వామి. తోలేం వెంకటస్వామి సాల్మన్ రాజ్ కోత్వాల శ్రీనివాస్ గుండ్ల మొగిలి బొంత సోమయ్య ధనకొండ రవి పుట్టా శ్రీనివాస్ మాజీ సర్పంచ్ కాయం పాపయ్య అజయ్ వెంకన్న సందీప్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు పోశం వెంకటేశ్వర్లు పప్పుల వెంకటేశ్వర్లు సతీష్. సన్నీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మందు బాబులకు అడ్డాగా నెహ్రూ నగర్ ప్లే గ్రౌండ్




**అంబర్ పేట, నవంబర్ 25 (నిఘా న్యూస్):** గోల్నాక డివిజన్ లోని కాచిగూడ నెహ్రూనగర్ ప్లే గ్రౌండ్ మందుబాబులకు అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లుతున్నాయి. జిహెచ్ఎంసి అంబర్ పేట సర్కిల్ – 16 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్లే గ్రౌండ్ కు ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో వాకర్స్ వస్తుంటారు. అదేవిధంగా ఇక్కడ వ్యాయామం చేయడానికి జిమ్, ఓపెన్ జిమ్, వాలీబాల్ గ్రౌండ్ లు ఉన్నాయి. అయితే రాత్రి వేళల్లో ఈ గ్రౌండ్ గేట్ ను మూసీవేసి తాళం వేసి లోనికి అనుమతించారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది రాత్రి వేళల్లో ఈ గ్రౌండ్ ను అడ్డాగా మార్చుకొని ఇక్కడ మద్యం సేవిస్తున్నారు. అనంతరం మద్యం గ్లాసులను ఖాళీ సీసాలను, నీళ్ల పాకెట్లను అక్కడే వదిలి వెళుతున్నారు. ఉదయం వాకింగ్ కు వచ్చే వారికి మద్యం గ్లాసులు,ఖాళీ సీసాలు, నీళ్ల ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ పోలీస్ గస్తీ లేకపోవడం వల్లనే మందుబాబులు ప్లే గ్రౌండ్ లో మద్యం సేవిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకవైపు ఫెన్సింగ్ ను తొలగించి గ్రౌండ్ లోకి ప్రవేశించి యదేచ్ఛగా మద్యం సేవిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# నల్ల చెరువులో గుర్రపు డెక్క తొలగింపు

### దోమల నివారణకు

### డ్రోన్ తో ద్రావణాల పిచికారి



**ఉప్పల్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** ఉప్పల్ నల్ల చెరువులో దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టినట్లుగా కార్పొరేటర్ మందుముల రజిత రెడ్డి తెలిపారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు పలు రకాల పనులను చేపట్టినట్టుగా చెప్పారు. ఉప్పల్ లోని నల్ల చెరువులో రూ.85 లక్షలతో చేపట్టిన పనులను సోమవారం కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. నల్ల చెరువులో గుర్రపు డెక్క సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీంతో దోమల సమస్య పెరిగిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి గుర్రపు డెక్కను తొలగించే పనులను చేపట్టామన్నారు. ఇదే కాకుండా దోమల నివారణకు డ్రోన్ తో పలు రకాల ద్రావణాలను పిచికారి చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, ఆకారపు అరుణ్,తుమ్మల దేవి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, కంచమిది శ్రీనివాస్, భూత్కూర్ రాజు,పీరంబీ, అలుగుల అనీల్ కుమార్, అల్వాలా భాస్కర్, అన్వార్ పాషా,నాగూర్ బాషా,నాగారం వెంకటేష్, బాకారం అరుణ్, రఘు గుప్తా, ఫకీర్, బాకారం మల్లికార్జున్, మండల నాగరాజు, ఢిల్లీ చంద్రశేఖర్ రెడ్డి, కన్నమైన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# దుప్పట్లు పంపిణీ చేసిన ఆర్యవైశ్య మహాసభ



**ఇల్లందు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణంలో ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నివసించే పేదలకు యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ మండల, పట్టణ అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ శీతల కాలం కావడంతో గత వారం రోజుల నుండి ఇల్లందు పట్టణంలో చలి తీవ్రత పెరగడంతో రోడ్డు సైడ్ జీవనం కొనసాగించే యాచకులు,పేదలు. గన్ని బ్యాగులు ప్లాస్టిక్ కవర్లు కప్పుకొని చలికి వనకడం చూసి చలించిపోయామన్నారు. అలాటి వాళ్ల పడే బాధలు వర్ణనాతీతం ఉన్నారు. వారి ఇబ్బందిని గుర్తించి ఇల్లందు ఆర్యవైశ్య సంఘం సభ్యులు అందరం కలిసి. వాహనాలపై తిరుగుతూ చలి తీవ్రతకు ఇబ్బంది పడే వారిని గుర్తించి వారికి ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేసామని తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలుగా తేలుకుంట్ల రజనీకాంత్ సంకా శ్యామ్ వాసవి క్లబ్ సభ్యులు పుల్లూరు సతీష్ కుమార్ యెలుగూరి మధుబాబు సైఫా రాజశేఖర్ ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సుమారు వీటి విలువ పదివేల రూపాయలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్ కండె రమేష్.యువజన సంఘం అధ్యక్షులు నరేంద్రుల అను గంధె సురేష్ తాటిపల్లి సుబ్బారావు అర్వపల్లి గణేష్. రామిడి శంకర్ బోనగిరి రమేష్.గౌరిశెట్టి నగేష్.చందా నాని. జొన్నల ఉపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# వలిగొండలో జోరుగా కుల గణన




**వలిగొండ, నవంబర్ 25 (నిఘా న్యూస్):** వలిగొండ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే ని యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించడం జరుగుతుందని ఎ మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.జితేందర్ రెడ్డి తెలిపారు. ఇట్టి సర్వే మండలంలో సుమారుగా పూర్తి కాబడుతుంది. ఇందులో భాగంగా మండలం లోని గ్రామ పంచాయతీలలో ఆవాస ప్రాంతాల్లో ఎవరైనా సర్వే నిర్వహణకు సంబంధించిన అధికారులు మీ వద్దకు రాకున్నా, అదే విధంగా మీరు అందుబాటులో లేక పోవడం లేదా మీ ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భంలో గానీ సర్వేలో నమోదు కానీ కుటుంబాల వారు నమోదు కోసం సహకరించగలరు. ఇందులో భాగంగా మిగిలిన కుటుంబాలు ఎవరైనా దయచేసి మీ సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నోడల్ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఫోన్ (పర్యవేక్షకుడి ఫోన్ నెంబర్.8686958899) ద్వారా లేదా ప్రత్యక్షంగా సంప్రదించి కుటుంబాన్ని ఇట్టి సర్వే రికార్డులలో నమోదు చేయించుకోవాల్సిందిగా ఎంపీడీవో డి.జితేందర్ రెడ్డి కోరారు.

# వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



**అశ్వారావుపేట, నవంబర్ 25 (నిఘా న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలోని పాలగుంపు గ్రామంలో గిరిజన కుటుంబాలకు కార్తీక మాసం చలికాలం సందర్భంగా వృద్ధులకు దుప్పట్లో పంపిణీ కార్యక్రమాన్ని వినాయకపురం గ్రామస్తులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు బెర్రం వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని కొనసాగించారు. మండల పరిధిలోని ఉన్న ఏజెన్సీ ప్రాంతమైన పాలగుంపు గ్రామంలో సుమారు 38 కుటుంబాలకు దుప్పట్లను ఆయా గ్రామంలో ఉన్న 40 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలు కలిగిన వృద్ధులకు దుప్పట్లను వితరణ సాగించారు ఇటువంటి సందర్భంలో గ్రామంలోనూ వృద్ధులు చలికాలంలో పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఇటువంటి కార్యక్రమాలను ప్రతి సంవత్సరం ప్రతి గ్రామంలోనూ కొనసాగించటం జరుగుతుందని గత కొన్ని సంవత్సరాలుగా ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్న సందర్భంలోనే ఈ ఏడాది కూడా వృద్ధులను దృష్టిలో పెట్టుకొని దుప్పట్లను వితరణ చేయడం జరుగుతుందని బెర్ర వెంకటేశ్వర తెలిపారు, ఈ కార్యక్రమంలో పండా రాజులు, కాకా సత్యనారాయణ, సున్నం వెంకటేశ్వరరావు, గొంది కృష్ణ, గొంది వెంకటేశ్వరరావు, కాకా మధు, కిరణ్. తదుపరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాను మెరుగు పరచండి

### కంటోన్మెంట్ ఎమ్మెల్యేను కోరిన గౌతమ్ నగర్ ప్రజలు



**సికింద్రాబాద్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** కంటోన్మెంట్ నియోజకవర్గం మహేంద్ర హిల్స్ లో ఉన్న రిజర్వాయర్ నుండి గౌతమ్ నగర్ డివిజన్ పరిధి ఇందిరా నెహ్రూ నగర్, జయగిరి లక్ష్మీనరసింహ స్వామి నగర్, రామాంజనేయ నగర్, న్యూ వెంకటేశ్వర నగర్, హిల్ టాప్ కాలనీ లకు మంచినీటి సరఫరాను మెరుగుపరచాలని కోరుతూ స్థానిక నాయకులు రాము యాదవ్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి గౌతమ్ నగర్ పరిధి అవసరమైన అన్ని కాలనీలకు మంచినీటి సరఫరా మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చినట్లు రాము యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నర్సింగ్, జలమండలి ఏఈ శ్రవంతి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఫెయిర్

### ప్రారంభించిన కార్పొరేటర్ బన్నాల



**చిలుకానగర్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** చిల్కానగర్ డివిజన్ లోని ప్రభుత్వ పాఠశాల లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ గీత పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటదని ఇలాంటి సైన్స్ ఫెయిర్ల ద్వారా పిల్లలు సొంతంగా ఆలోచించే అవకాశం కలుగుతుందని తెలుపుతూ మునుముందు విద్యార్థులు సైంటిస్టులుగా ఎదిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్ ఫెయిర్లు ఎంతో దోహద పడతాయని పేర్కొన్నారు. ఎన్జీవో అగస్త్య వారు పిల్లలకి ఈ సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేయుటకు తోడ్పడిన వారిని కార్పొరేటర్ గీత అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయులు, నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, మాస శేఖర్ మహమ్మద్ చేర్యాల శ్రీనివాస్, అశోక్ చారి, శ్యామ్, ఎన్జీవో అగస్త్య మెంబర్స్ వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల కారును ఢీ కొన్న బస్సు





**దమ్మపేట, నవంబర్ 25 (నిఘా న్యూస్):** దమ్మపేట మండలం మందలపల్లి వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఖమ్మం నుండి అయిదుగురు అయ్యప్ప మాలదారులు ఏపీలోని ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయంలో ఇరుముడి సమర్పించేందుకు వెళుతుండగా మందలపల్లి ఆర్టీసీ బస్ స్టాండ్ ఔట్ గేటు వద్ద సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ అయ్యప్ప స్వాముల కారును ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం లేకపోవటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.ఈ ప్రమాదంలో కారు ముందు భాగం కొంత దెబ్బ తినటంతో స్వాముల పోలీసులను ఆశ్రయించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రెండు వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించి విచారణ చేపట్టారు.

## మోత్కూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కు సన్మానం



**అడ్డగూడూరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** అడ్డగూడూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మోత్కూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమితులైన అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన బలెంల విద్యాసాగర్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వీట్లు పంచి ,శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ తనను మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమించేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే మందుల సామెల్ కి ,పార్టీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల రైతులకు మార్కెట్ పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా ప్రతి ఒక్కరికి నిత్యం అందుబాటులో ఉంటూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల వల్ల శారీరక మానసిక దృఢత్వం

### ఎమ్మెల్యే సబితా రెడ్డి



**బాలాపూర్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వాన్ని పొందవచ్చని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లేల్ గూడ రాఘవేంద్ర నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ గ్రౌండ్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ఒత్తిడి లాంటి సమస్యలనుండి ఉపశమనం పొందాలంటే ఇటువంటి క్రీడలు దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్లు భూపాల్ రెడ్డి, కీసర గోవర్ధన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సిద్దాల పద్మ అంజయ్య, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య , ఏనుగుల అనీల్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గోపి యాదవ్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన రాజన్న ఆలయం

### దర్శనానికి ఐదు నుండి ఆరు గంటల సమయం





**వేములవాడ, నవంబర్ 25 (నిఘా న్యూస్):** తెలంగాణలోని అతి పెద్ద పుణ్యక్షేత్రమైనటువంటి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా రాజన్నను భక్తులు తెల్లవారుజాము నుండి ధర్మగుండంలో స్నానాలు చేసి స్వామివారి మొక్కులు, కోడెమొక్కులు అన్నపూజ కళ్యాణం కుంకుమ పూజలు వివిధ రకాల పూజల్లో పాల్గొన్నారు ఆలయ పరిసరాలన్నీ భక్తులతో నిండిపోయాయి రాజన్న దర్శనానికి ఐదు నుంచి ఆరు గంటల సమయం పట్టింది శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమ్రోగయి అలయాధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పి శేషాద్రిని రెడ్డి



**వేములవాడ, నవంబర్ 25 (నిఘా న్యూస్):** వేములవాడ పట్టణంలో శ్రీ అయ్యప్ప స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుండి జనవరి 5వ తేదీ వరకు జరిగే అన్నదాన కార్యక్రమంలో సోమవారం ఎస్పీ శేషాద్రిని రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ భక్తి భావం పెంపొందించే లాగ స్వాములు కార్యక్రమాలు ఉన్నాయని అన్నారు. అలాగే ఆ స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి అందరు బాగుండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



**నారాయణపేట, నవంబర్ 25 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా ఊట్కూరు మండల కేంద్రంలోని పగిడిమర్రి గ్రామంలో సోమవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తనిఖీ చేసిన మండల విద్యాశాఖ అధికారి రాఘవేంద్ర చారి ఉపాధ్యాయులకు వివరాలు అడిగి పాఠశాల ఫైళ్లను తనిఖీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి దృష్టికి పాఠశాలలు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు అధికారికి తెలిపారు. విద్యాశాఖ అధికారి సరైన సమాధానము ఇవ్వలేక పోయారు. త్వరలో మరుగుదొడ్లు నిర్మించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు.

## నేడు జురిస్ట్, సేవారత్న అవార్డుల ప్రదానం

### తెలంగాణ మేధావుల ఫోరం




**హైదరాబాద్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర ఆధ్వర్యంలో ఈనెల 26న జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మేధావులు ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.10 నుంచి 1 వరకు జరిగే కార్యక్రమంలో ప్రముఖ లా ప్రొఫెసర్, చైర్మన్ తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ బాలకృష్ణ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ వారితోపాటు రిటైర్డ్ జస్టిస్ పిఎస్ నారాయణ, జుడీషియల్ ఆఫీసర్ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషన్ ఆర్టీఐ జడ్జ్ టీ.గోపాల్ సింగ్, మాజీ హైకోర్టు ప్రభుత్వ ప్లీడరు డిఎల్ పాండు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

# కరీంనగర్ నుండి వేములవాడకు ఉద్యమకారుల పాదయాత్ర

### ఈనెల 27, 28వ తేదీలలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహణ

**వలిగొండ, నవంబర్ 25 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ఈనెల 27, 28వ తేదీలలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో కరీంనగర్ నుండి వేములవాడ వరకు నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప మహా పాద యాత్రలో తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులు వేలాదిగా తరలివచ్చి ఉద్యమకారుల ఐక్యతను చాటాలని ఉద్యమకారుల పోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని, తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ పిలుపులో భాగంగా విజయ సంకల్ప మహా పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ సంస్కృతి సారధిలో 1000 ఉద్యోగాలు కల్పించాలని, ప్రభుత్వం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ స్వతంత్ర సమరయోధులుగా గుర్తించి 25 వేల రూపాయల



పెన్షన్ అందించాలని, అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో ఉద్యమకారులకు, ఉద్యమ కళాకారులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఉద్యమ వృద్ధ కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్ నుండి వేములవాడ వరకు జరిగే మహాపాదయాత్రను విజయవంతం చేయడానికి వేలాదిగా తరలిరావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ శీలం స్వామి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధమల్ల బాలయ్య, మండల అధ్యక్షులు మారగొని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల హాస్టల్లను కలెక్టర్ తనిఖీ చేయాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు

**వలిగొండ, నవంబర్ 25 (నిఘా న్యూస్):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని లోతుకుంట పట్టణంలో ఉన్న ఆదర్శ పాఠశాల బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఎస్ఎఫ్ఐ సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ వెంటనే వలిగొండ మోడల్ స్కూల్ హాస్టల్ ను సందర్శించి హాస్టల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. అదేవిధంగా హాస్టల్ బాధ్యులుగా ఉన్న ఎస్ఓ తీవ్రమైన పర్యవేక్షణ లోపం గా వ్యవహరించడం వలన విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఎస్ ఓ హాస్టల్ కి రారు సమస్యలు వినరు హాస్టల్లో గ్లిజరిన్ పని చేయక సంవత్సరం గడుస్తా ఉన్న విద్యార్థినిలు చల్లని వాటర్ తో ఉదయాన్నే తల స్నానాలు చేయడం వలన విద్యార్థులకి జలుబు జ్వరాలు వ్యాపించిన పట్టించుకునే వారే లేరన్నారు. మరొకవైపు హాస్టల్లో బాత్రూంలకు



డోర్లు సరిగా లేవు. గ్రైండర్ పనిచేయక టిఫిన్లు పెట్టే పరిస్థితి లేదన్నారు. వెంటనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎస్ఓపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హాస్టల్లో ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టును భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బుగ్గ ఉదయ్ కుమార్, మైసోల్ల నరేందర్, సాయి, వినయ్, వరుణ్, ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్ష పోరాట సమితి అధ్యక్షులుగా దుబ్బ లింగం

**భువనగిరి. నవంబరు 25 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామానికి చెందిన దుబ్బ లింగం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపీఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం అంబేద్కర్ అభయస్థాన్ని అందించాలని దాని ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని



డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలను అందించాలని పెండింగ్ లో ఉన్న దళితుల కార్పొరేషన్ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల పౌర హక్కుల దినాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పౌర హక్కుల దినాన్ని పాటించని అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో దళితుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. వీరితోపాటు మండలం నుండి జిల్లా కమిటీకి ఏటెల్లి నరసింహ ఎన్నికయ్యారు.

# మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట

### మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

**అమీన్పూర్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువులో మత్స్య శాఖ ఆధ్వర్యంలో లక్ష యాభై వేల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయడంతో పాటు, మార్కెటింగ్ సౌకర్యం అందిస్తోందని తెలిపారు. ఈ సదవకాశాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరు మత్స్య సహకార సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న చేప పిల్లలతో మత్స్య సంపద అభివృద్ధి చెందడంతో పాటు మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ,కొల్లూరి చంద్రకళ గోపాల్,కో ఆప్షన్ సభ్యులు తల్లారి



రాములు, యునుస్, నర్సింగ్ రావు ఫిషరీస్ సంగారెడ్డి,మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కొల్లూరి యాదగిరి, సీనియర్ నాయకులు, గజ్జల కృష్ణ, మనే రవీందర్, యెర్రోల సీతయ్య, రత్నాల యాదయ్య, రత్నాల దశరథ్, గజ్జల వీరయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని చెట్ల కొమ్మల నరికివేత

- పర్యవరణానికి హానీ కలిగిస్తున్న బిల్డింగ్ యజమానులు
- చర్యలకు వెనుకాడుతున్న హార్టికల్చర్ అధికారులు

**నల్లకుంట, నవంబర్ 25 (నిఘా న్యూస్):** పచ్చనీ చెట్లు ప్రగతికి మెట్లు అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క ప్రజలకు అవగాహన కల్పిస్తుంటే మరోపక్క నల్లకుంట డివిజన్ లో కొంతమంది పచ్చని చెట్లను యదేచ్చగా నరికి వేసి పర్యవరణానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొంతమంది ఇండ్ల యజమానులు తమ ఇంటికి అడ్డుగా ఉన్నాయనే నెపంతో ఎవరి అనుమతి లేకుండా పచ్చని చెట్లను, కొమ్మలను ఇష్టానుసారం కొట్టేస్తున్నారు. ఎవరికి అనుమానం రాకుండా తమ స్వలాభం కోసం చెట్లను,కొమ్మలను కొట్టి వేస్తూ పూర్తిగా మాయం చేస్తున్నారు. ఇలాంటి సంఘటననే ఒకటి సోమవారం నల్లకుంట డివిజన్ లో జరిగింది. నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ నుండి శంకరమఠం కు వెళ్లే దారిలో బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఓ వ్యాపార సముదాయం కోసం బిల్డింగ్ ఈ యజమాన్యం నిర్మాణం చేపట్టింది. ఈ బిల్డింగ్ ముందు రెండు చెట్లు ఉన్నాయి. ఈ రెండు చెట్ల కొమ్మలు తమ వ్యాపార సముదాయానికి అడ్డుగా ఉన్నాయని యజమానులు సోమవారం ఉదయం గుట్టు చప్పుడు కాకుండా కొంతమందితో చెట్ల కొమ్మలను నరికి వేయించారు. ఈ విషయమై హార్టికల్చర్ శాఖకు ఓ పాత్రికేయుడు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు సమాచారం అందుకున్న నల్లకుంట డివిజన్



హార్టికల్చర్ సూపర్వైజర్ ఫయాజ్ సిబ్బందితో పాటు వెంటనే అక్కడికి చేరుకొని చెట్ల కొమ్మలను కొట్టివేస్తున్న వారిని ఆపి వేయించారు. అనుమతి లేనిదే చెట్లను, కొమ్మలను కొట్టకూడదని చెప్పి ఆయన హెచ్చరించారు. గత నెలలో కూడా ఇదే యజమాని నల్లకుంట డివిజన్ లో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న జిహెచ్ఎంసి ఎస్ఎఫ్ఏ సురేష్, బోయినీ కుమార్ లా చెట్లను కొట్టడానికి ప్రయత్నిస్తే హార్టికల్చర్ సిబ్బంది అడ్డుకున్నట్లు తెలిసింది. కొద్ది రోజులకే మళ్లీ ఇక్కడి చెట్ల కొమ్మలను నరికి వేయడం చర్చనీయాంశంగా మారింది. ఇందులో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

# నిరసన ర్యాలీని విజయవంతం చేయండి

**మద్దూర్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో జరుగు నిరసన ర్యాలీని సభను జయప్రద చేయాలని కోరుతూ మండల కేంద్రంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని రైతు రుణమాఫీ చేయాలని పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలని ఉపాధి కూలీలకు కనీస కూలి రూ. 600 లు పెంచి ఒక కుటుంబానికి 200ల పనిదినాలు కల్పించాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జోషి, వ్యవసాయకార్మిక



సంఘం మండల కార్యదర్శి శివకుమార్, నాయకులు వెంకటప్ప, సిద్ధిలింగప్ప, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి సహకారం

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





**కరీంనగర్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** గంగాధర మండలం ఉప్పర మల్యాలలో నూతనంగా నిర్మించిన పోచమ్మ (శీతల దేవి) ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే. ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికి శాలవాలతో సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రజలు పాడి పంటలతో సుఖసంతోషాలతో జీవించాలని పోచమ్మ తల్లికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, గంగాధర మార్కెట్ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, గంగాధర్ సింగ్ వైస్ చైర్మన్ వేముల భాస్కర్,రుద్ర మల్లేషం, పెంచాల చందు,కాంగ్రెస్ పార్టీ బ్లాక్, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తోట సంధ్యా, దోర్నాల శ్రీనివాసరెడ్డి, వోద్నల యగ్నేష్, అట్లా శేఖర్ రెడ్డి, జాగిరపు శ్రీనివాస్ రెడ్డి,మేర్గ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మాధారం గ్రామంలో మహా పడిపూజ

### హాజరైన పటాన్ చెరు కాంగ్రెస్ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్



**పటాన్ చెరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** జిన్నారం మండలం మాదారం గ్రామంలోని కోలన్ అనంతరెడ్డి గార్డెన్స్ లో కోలన్ చంద్రపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్న పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్.

## మాతృభూమి రుణం తీర్చుకునేందుకు ముందుకు రావాలి

### అమెరికాలో తానా సభ్యులనుద్దేశించి ప్రసంగిస్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**వాషింగ్టన్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** తెలుగు రాష్ట్రాలు, వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధికి అమెరికా తెలుగు అసోసియేషన్ సభ్యులు కృషి చేసి మాతృభూమి ఋణం తీర్చుకోవాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు. 79 వ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సమావేశాలు అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జరుగగా భారత ప్రతినిధిగా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వెళ్లి ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశం అనంతరం అమెరికా తెలుగు అసోసియేషన్ ప్రతినిధుల ఘన సన్మాన సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కీలకోపన్యాసం చేశారు. తానా ప్రతినిధులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.



శ్రీకాళహస్తి పట్టణం నందు చిరు వ్యాపారులకు స్థలాలు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య వీధి వ్యాపారుల సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ శివ కుమార్, పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి చిరు పాల్గొన్నారు.

*–శ్రీకాళహస్తి, నవంబర్ 25 (నిఘా న్యూస్):*

# వీధులను పరిశుభ్రంగా ఉంచాలి

### మున్సిపల్ సిబ్బందికి అవగాహన కల్పించిన చైర్ పర్సన్ మర్రి దీపిక



**మేడ్చల్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** మేడ్చల్ మునిసిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ మర్రి దీపిక రెడ్డి మునిసిపల్ జవాన్లు,డ్రైవర్లు, వాటర్ మెన్ లతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో వారు డోర్ టూ డోర్ చెత్త సేకరించే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు డోర్ టూ డోర్ చెత్త సేకరించే వాహనాలు పట్టణంలోని ప్రతి వీధి, ప్రతి ఇంటి నుండి చెత్త సేకరించాలని అన్నారు, తడి,పొడి, హానికరమైన చెత్త విభజన విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త సేకరించే వాహనాలు మరమ్మత్తులకు గురైతే వెంటనే వారి దృష్టి కి తీసుకు రావాలన్నారు, క్రమం తప్పకుండ ప్రతి వార్డులో ఫాగింగ్ చేయాలని, ఇతర దోమల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు, స్వచ్ఛ మేడ్చల్ లో ముఖ్య భూమిక పారిశుధ్య సిబ్బందిదే అని కొనియాడారు, వాటర్ మన్ లు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి సరఫరా చేయాలని అన్నారు, నీటి సరఫరా చేసే సమయంలో మార్పు లేకుండా, ఒకే సమయానికి నీటిని వదలాలని సూచించారు. ప్రజలు తమ పనులపై బయటికి వెళ్ళాకా నీటిని వదిలితే ఉపయోగం ఉండదని తెలిపారు. నీటి పైప్ లైన్ మరమత్తులు ఉంటె ఇతర ఏర్పాట్లు చేసి ప్రజలకు నీటిని అందించాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారి పట్ల కఠినంగా ఉంటామని తెలిపారు. పట్టణ ప్రజలు వీధుల వెంట చెత్త పార వేయకుండా, చెత్త సేకరించే మునిసిపల్ వాహనాలకు మాత్రమే చెత్తను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఏ ఈ సుందర్ నాయక్, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, వర్క్ ఇన్స్పెక్టర్ విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

### అభినందించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**మల్లాపూర్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** మల్లాపూర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంఘం అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మల్లాపూర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ప్రతినిధులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు కాసం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి ముత్యం రెడ్డి, సహా కోశాధికారి రాజిరెడ్డి తదితరులను పాల్గొన్నారు.

## అర్హులైన వీధి విక్రయదారులకు రుణాలు



**తిరుపతి, నవంబర్ 25 (నిఘా న్యూస్):** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన వీధి విక్రయదారులు ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు అందిస్తున్నమని యూనియన్ బ్యాంక్ కరకంబాడి బ్రాంచిమేనేజర్ సరిత అన్నారు. పి.యం. స్వానిధి పథకం ద్వారా- స్వనిధి కూడా - స్వాభిమానం కూడా పక్షం రోజులు కార్యక్రమాన్ని తిరుపతిలో నిర్వహించారు. నవంబర్ 8.వ, తేదీ నుండి డిసెంబర్ 2 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తిరుపతిలోని విక్రయదారులతో నిర్వహించిన సమావేశంలో బ్యాంకు మేనేజర్ సరిత పాల్గొన్నారు. ఈ పిఎం సహాయనిధి గూర్చి వీధి విక్రయదారులు వివరించారు. బ్యాంకు నుండి లోన్ తీసుకున్న వారు సక్రమంగా కంతుల వారీగా చెల్లిస్తే రుణాలు ఇస్తామని అన్నారు. పది వేలు తీసుకొని తిరిగి కంతుల వారిగా చెల్లించిన వారికి మరల రు. 20 వేల లోను తీసుకొన్నవారి కి రు.50 వేలు ఇచ్చి వారి ఆర్థికాభి వృద్ధి మెరగు పరిచేందుకు తమ వంతు సహాయం అందిస్తామని అన్నారు. అదేవిదంగా పది వేలు తీసుకున్న వారికి సామాజిక ఆర్థిక కుటుంబ సర్వేని నిర్వహించడం, డిజిటల్ ట్రాన్సాక్షన్స్, ఇన్సురెన్స్ స్కీమ్ పై అవగాహన కల్పించారు. ఈ ఆర్థిక సర్వేలు అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ యస్.క్రిష్ణవేణి, సి.ఓ కావమ్మ, టి.యల్.ఎఫ్., యస్.ఎల్.ఎఫ్, ఆర్.పిలు వీధివిక్రయదారులు పాల్గొన్నారు.

## కమనీయంగా.. చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి మహోత్సవం



**ప్రొద్దుటూరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** తోగటవీర క్షత్రియుల, దేవాంగుల కుల దైవం చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి మహోత్సవం ఆదివారం అర్ధరాత్రి నుండి సోమవారం తెల్లవారు వరకు కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి చౌడేశ్వరి అమ్మవారికి తొట్టి మెరవణి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని చౌడేశ్వరి నగర్, మేదరవీధి, వినాయకనగర్, విజయనగరం వీధి, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, హనుమాన్ నగర్, శ్రీరామ్ నగర్ తదితర ప్రాంతాల్లో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయాలలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక గోక్షీర, పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి జ్యోతి మహోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మాలలు ఒక్క తాటిపైకి రావాలి





**కడప, నవంబర్ 25 (నిఘా న్యూస్):** మాలలందరూ ఒకే తాటిపై నడవాలని ఏపీ రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జాకట విజయ్ శేఖర్ పిలుపు ఇచ్చారు. కృష్ణ జిల్లా నూజివీడులో జరిగిన మాలల ఆత్మ గౌరవ సభకు ఆయన బృదాం హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జాకట విజయ్ శేఖర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రంలో ఉన్నటువంటి మాలలు ఒక తాటి మీదికి వచ్చి ఎస్సీ వర్గీకరణను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాలలు అందరూ వాడవాడల తిరిగి ఒక వర్గీకరణ విషయంలో మాలలంతా బలోపేతమై లక్షలాది మందితో భారీ బహిరంగ సభలో రాబోవు రోజుల్లో మాలల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా అంబేద్కర్ ముని మనవడు రాజారత్నం అంబేద్కర్ రావడం చాలా సంతోషకరం అన్నారు. అంతే కాకుండా జీవి హర్ష కుమార్, మల్లెల వెంకటరావు, వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమం లో కడప నగర అధ్యక్షులు చెంచుల డేవిడ్ సత్యారాజ్, జమ్మలమడుగు తాలూకా అధ్యక్షులు జె.దీపక్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బేధంపూడి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## 149 కోట్ల అంచనాలతో.. విశాఖ రైల్వే జోన్ పనులకు టెండర్ల ఆహ్వానం

- ఫలించిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉత్తరాంధ్ర ప్రజానీకం



**శ్రీకాకుళం, నవంబరు 25 (నిఘా న్యూస్):** గత దశాబ్ద కాలంగా ప్రస్తుత కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, స్థానిక పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు చేస్తున్న కృషి ఫలించింది. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని ఆయన చేస్తున్న డిమాండుకు కేంద్రం ఇటీవల ఆమోదం తెలపడంతో పాటు తాజాగా జోన్ నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లకు ఆహ్వానిస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. దీనికి సంబంధించిన వివరాలను రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ తన సామాజిక మాధ్యమం ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. దీనిపై ఉత్తరాంధ్ర జిల్లాల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొలి గెలుపు నుంచీ పోరాటమే. 2014లో శ్రీకాకుళం పార్లమెంట్ నుంచి తొలిసారి గెలిచిన రామ్మోహన్ నాయుడు తన తొలి ప్రసంగం నుంచే రైల్వే జోన్ పై తన గళం వినిపించారు. 2018 ఏప్రిల్ 17న అధికార పార్టీ ఎంపీగా ఉన్నా ప్రజల ఆకాంక్షను వినిపించేలా శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ లో, అనంతరం ఇచ్ఛాపురంలో దీక్షకు దిగారు. 2019లో రెండో సారి గెలిచిన తరువాత మరింత స్పీడ్ పెంచారు. ఒకవైపు పార్లమెంటులో పోరాడుతునే, రైల్వే డివిజన్, బోర్డు సమావేశాల్లో విశాఖ రైల్వే జోన్ ప్రాధాన్యతను తెలియజేశారు. గత 10 ఏళ్లుగా రైల్వే మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతునే ఉన్నారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం జోన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు దీనికి సంబంధించిన నిర్మాణ పనులకు రూ.149 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. దీనిపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఢిల్లీ నుంచి స్పందించారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల డిమాండ్ ను నెరవేర్చడంలో కేంద్రం చర్యను స్వాగతించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వేగవంతంగా పనులు పూర్తి చేసి, ప్రయాణికులకు అంకితమిస్తామని వెల్లడించారు.

## కాశీవిశ్వ నాథునికి లక్ష బిల్వార్చన

### పూజలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే, కార్పొరేటర్ ప్రభుదాస్



**మౌలాలి, నవంబర్ 25 (నిఘా న్యూస్):** కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలో గల హెచ్ బి కాలనీ ఫేస్-2 ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నందు కాశీవిశ్వ నాథునికి లక్ష బిల్వార్చన పూజలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ తో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాశీ విశ్వనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉల్లెమ్ బాలరాజు, నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, ఆశోక్ రెడ్డి, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్పేట్ ఆర్య వైశ్యుల వన సమారాధనజి



**బాలాపూర్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజనాలు పాలమూరు జిల్లా కందూరు గ్రామం చారిత్రాత్మక మైన శ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 6 వందల మంది ఆర్యవైశ్యులు పాల్గొన్నారని కార్పొరేషన్ అధ్యక్షులు మంచన ప్రేమ్ కుమార్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన భోజనాలతో ఆధ్యాత్మికత,సమాజంలో సామరస్యం పెరుగుతుందని అన్నారు. కార్పొరేషన్ లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆట పాటలతో, చిన్నా పెద్దలు ఉల్లాసంగా వన భోజనాలలో పాల్గొన్నారని అన్నారు. ప్రతి రోజూ ఉండే పని ఒత్తిడిని తగ్గించి, ఆర్యవైశ్యులలో సోదరభావం పెంపొందడానికి దోహదపడుతుందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని తమ సమాజానికీ ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడానికి కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## రాజ్యాంగ దినోత్సవం స్ఫూర్తితో.. హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

### జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.శ్యామసుందర్



**ఆమదాలవలస, నవంబర్ 25 (నిఘా న్యూస్):** రాజ్యాంగ దినోత్సవం నిర్వహించడం ద్వారా స్ఫూర్తిని పొందుతామని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి శ్యామసుందర్ చెప్పారు. సోమవారం కళాశాల ఆవరణలో రాజ్యాంగ హక్కుల పరి రక్షణ వేదిక కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. వేదిక జిల్లా కన్వీనర్ వద్దేపల్లి మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఈనెల 26వ తేదీన జరుగుతున్న రాజ్యాంగ దినోత్సవాన్ని రాజకీయాలకు అతీతంగా అందరూ నిర్వహించాలని కోరారు. డాక్టర్ అంబేద్కర్ ఎంతో ముందు చూపుతో ప్రజలకు హక్కులను కల్పిస్తూ రాజ్యాంగం రచించారని, వాటికి వివిధ రూపాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని వేదిక జిల్లా కన్వీనర్ మోహనరావు ఆందోళన వ్యక్తం చేశారు. హక్కుల పరిరక్షణ కోసమే వేదికను ఏర్పాటు చేశామని, శ్రీకాకుళంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఏడు రోడ్ల జంక్షన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల వారు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక గౌరవ సలహాదారు నల్లి ధర్మారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ ఈశ్వరరావు, కళాశాల లెక్చరర్లు జి.ధనంజయరావు, జి.తిరుపతిరావు, పి.సందీప్ కుమార్, కె.రాజారావు, జె.రవిబాబు,బి.పుష్పలత,జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

- ఉపాధ్యాయులను ఉద్దేశించి విద్యార్థుల ప్రసంగం
- రామచంద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



**రామచంద్రపురం, నవంబర్ 25 (నిఘా న్యూస్):** 1998-1999 రామచంద్రాపురం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది, పూర్వ విద్యార్థుల ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు ఉపాధ్యాయులను ఉద్దేశించి విద్యార్థులు మాట్లాడారు. వారు నేర్పిన విద్యాబుద్ధులే నేడు ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లిందని జీవితానికి స్థిరత్వాన్ని కల్పించిందని కొనియాడారు. అనంతరం శాలువా పూలమాలలతో ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేయడం తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఉన్నటువంటి గౌరవ మర్యాదలను ప్రతిబింబిస్తుందని భవిష్యత్ తరాలకు కూడా ఇది ఒక మంచి సందేశం అని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో ఆనందంగా ఉందని ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం అభినందనీయమని పూర్వ విద్యార్థులను ప్రశంసించారు. భోజనం అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో మహిళలు చురుకుగా పాల్గొన్నారు వివిధ ఆటలలో గెలిచిన వాళ్లకు ప్రథమ ద్వితీయ బహుమతులను ప్రధానం చేశారు. 25 సంవత్సరాల తర్వాత అదే పాఠశాలలో కలుసుకున్న విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉషా కులకర్ణి ఉపాధ్యాయులు నాగభూషణం, అమీరుద్దీన్,ఇందిరా భాస్కర్, శివారెడ్డి, సంధ్యారాణి, హెలినా, కిష్టయ్య,బసవేశ్వర్, లక్ష్మణ్,రవీందర్, కవిత పాల్గొన్నారు.

## ఘనంగా మునెయ్య స్వామి తిరుణాలు

### పెద్ద ఎత్తున బోనాలు సమర్పించిన భక్తులు



**ప్రొద్దుటూరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** స్థానిక రామేశ్వరంలో వెలసిన అవధూత, మహిమాన్వితుడు మునెయ్య స్వామి వారికి కార్తీక మాస చివరి సోమవారం నిర్వహించే తిరుణాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణ, మండల పరిధి నుండే కాక వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని బోనాలు, జంతు బలులు, కాయ కర్పూరం, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది.

## విద్యార్థుల.. మానసిక స్థితిని ఉపాధ్యాయులు గుర్తించాలి

### మానసిక ఆరోగ్యానికి ధ్యానం, వ్యాయామం అవసరం



**పటాన్ చెరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** గీతం అధ్యాపకులకు సూచించిన మానసిక ఆరోగ్య శిక్షకుడు రాహుల్ మండల్. మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం ధ్యానం, శారీరక వ్యాయామం, సామాజిక కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనడంతో పాటు జీవన సమతుల్యతను కొనసాగించాలని తద్వారా సానుకూల దృక్పథంతో ముందుకు సాగిపోవచ్చని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ మానసిక ఆరోగ్య శిక్షకుడు రాహుల్ మండల్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని మెంటార్లకు 'అవగాహన ద్వారా సాధికారత మానసిక ఆరోగ్య ప్రథమ చికిత్స శిక్షణ' అనే అంశంపై సోమవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. మానసిక ఆరోగ్యంపై అవగాహనను కల్పిస్తూనే, దాని బహుముఖ స్వభావాన్ని రాహుల్ ఆవిష్కరించారు. ఇది మన మనస్సు యొక్క కలయికగా ఆయన అభివర్ణిస్తూ, ఇందులో ఆలోచనలు, భావాలు, సామాజిక స్వభావాలు ఉంటాయన్నారు. ఇంటెలిజెన్స్ కోషెంట్ (ఐక్యూ), ఎమోషనల్ కోషెంట్ (ఈక్యూ), సోషల్ కోషెంట్ (ఎస్ క్యూ)ల గురించి వివరిస్తూ, వర్తమాన సమాజంలో ఈక్యూ, ఎస్ క్యూలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను ఎత్తిచూపారు. ఈ ఫ్రేమ్ వర్క్ ల ప్రకారం మానసిక ఆరోగ్యం అంటే ఏమిటో మనం అర్థం చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఆరోగ్య సవాళ్లను గుర్తించడానికి, ప్రతిస్పందించడానికి తగిన నైపుణ్యాలు సమకూర్చుకునేలా అధ్యాపకులను సన్నద్ధం చేయడం లక్ష్యంగా రాహుల్ ఉపన్యసించారు. మానసిక కుంగుబాటుకు సంబంధించిన సంకేతాలు, లక్షణాలను గుర్తించడంలో అధ్యాపకులు అప్రమత్తంగా ఉండాలని, తగిన విధంగా స్పందించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. గీతం ప్రాంగణం లోపల, వెలుపల ఉన్న సహాయక సేవలను విద్యార్థులు తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. శారీరక, విద్యా, ప్రవర్తన, భద్రత, అత్యవసర సంకేతాలతో సహా విద్యార్థి బాధపడుతున్నట్టు సూచించే కీలక సూచికలను రాహుల్ మండల్ వివరించారు. అధ్యాపకుల కోసం ఆయన ఆచరణాత్మక కార్యాచరణ ప్రణాళికను అందించారు. విద్యార్థులతో కలగలుపుగా ఉండాలని, ముందే ఓ అభిప్రాయానికి వచ్చినట్టు కాకుండా సంభాషణలను ప్రారంభించాలని, స్వీయ-హాని లేదా ఆత్మహత్య ప్రమాదాన్ని అంచనా వేయాలని, అవసరమైనప్పుడు వృత్తిపరమైన సాయం పొందాలని విద్యార్థులను ప్రోత్సహించాలని అధ్యాపకులకు సూచించారు. ఆచరణాత్మక వ్యూహాలతో పాటు, విద్యార్థులు, అధ్యాపకులకు స్వీయ-సంరక్షణ, క్షేమం అభ్యాసాల ప్రాముఖ్యతను రాహుల్ వివరించారు.

## కార్తీక దీపం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

### తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి, నవంబర్ 25 (నిఘా న్యూస్):** చీకటిపై వెలుగు సాధించినవిజయానికి ప్రతీక దీపమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం రామచంద్రయ్య పుష్కరిణిలో తిరుపతి ఫిల్మ్ సొసైటీ కోటి దీప మహోత్సవం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని దీపాలు వెలిగించి శివపార్వతులను పూజించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపోత్సం నిర్వహించడం హిందూ సాంప్రదాయమన్నారు. 365 ఒత్తులతో దీపం వెలిగించడం ద్వారా ఏడాది పొడువునా దీపం వెలింగించక పోయినా ఆ అపరాధ భావన పోతుందని ఆయన చెప్పారు. దీపోత్సవంతో కుటుంబ బంధాలు బలోపేతం కావడమే కాకుండా సామరస్య భావన బలపడుతుందని ఆయన తెలిపారు. ఫిల్మ్‌సొసైటీ పదేళ్ళుగా కోటి దీప మహోత్సవాలను నిర్వహించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షులు వైఎస్ బాబు, కార్యదర్శి శేషగిరి రావు, ఎంఎల్ సి సిపాయి సుబ్రమణ్యం, టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, శాప్ ఛైర్మన్ రవి నాయుడు,మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్,పిసి రాయల్ తదితరలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు గన్నవరం విద్యార్థులు



**గన్నవరం, నవంబర్ 25 (నిఘా న్యూస్):** ఈ నెల 26 నుండి 28 వరకు నంద్యాల లో జరుగనున్న ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల యస్.జి.యఫ్ అండర్-19 ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ లో గన్నవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు బి లక్ష్మి దుర్గ (ద్వితీయ సంవత్సరం బై.పి.సి) పి.కీర్తి (ద్వితీయ సంవత్సరం యం.పి.సి), బి.మేఘన (ద్వితీయ సంవత్సరం యం.పి. సి) ఇ. సాహితి (ప్రథమ సంవత్సరం యం.పి.సి)లు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి ఉమాదేవి తెలిపారు. అలాగే వి కే ఆర్ కళాశాల విద్య నభ్యశిస్తున్న ఏ.రెహాన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఉత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన వ్యాయామ విద్య సహాయకులు ధనియాల నాగరాజును అభినందించారు.

## శ్రీకాళహస్తీశ్వర స్వామి సేవలో మాజీ టిటిడి చైర్మన్



**శ్రీకాళహస్తి, నవంబర్ 25 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానమునకు తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు చదలవాడ కృష్ణమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి స్వామి అమ్మవార్ల దర్శనార్థం విచ్చేశారు.వీరికి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం దక్షిణామూర్తి వద్ద వారికి శేష వస్త్రాలతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ముని కుమార్, ప్రసాద్, ఈశ్వర్ సాయి తదితరులు పాల్గొన్నారు.


## మూడు సంవత్సరాలుగా శివోహం అన్నప్రసాద సేవ



**ప్రొద్దుటూరు, నవంబర్ 25,(నిఘా న్యూస్):** శివోహం కమిటీ వారి ఆలోచన ప్రశంసనీయమని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, ప్రజలు తెలిపారు. సోమవారం స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం నిర్వహించే అన్నప్రసాద సేవలో భాగంగా ఎవరెస్ట్ లాడ్జి ప్రొప్రైటర్ దివంగత మూల ఈశ్వర రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో, రెడ్డి సేవా సంఘం సహకారంతో అన్నప్రసాద సేవ నిర్వహించారు. దాదాపు 800 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు మాట్లాడుతూ దాదాపు గత మూడు సంవత్సరాలుగా శివోహం అన్నప్రసాద సేవా సంఘంవారుఅన్నప్రసాదసేవనిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ప్రతి వారం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా శివోహం అన్నప్రసాద సేవ సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించడం వారి సేవా నిరతికి నిదర్శనమన్నారు. వారి సేవలు మరిన్ని రోజుల పాటు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ సభ్యులు మురుకూటి సూర్య నారాయణ రెడ్డి, విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వాలంటీర్లకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి

### గన్నవరం జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి



**గన్నవరం, నవంబర్ 25 (నిఘా న్యూస్):** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మాట తప్పి, మడమ తిప్పితే ఎలా చంద్రబాబు. వాలంటీర్లు వ్యవస్థకు మంగళం పాడకుండా పునరుద్ధరిం చాలని గన్నవరం జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి విజ్ఞప్తి చేశారు. వాలంటీర్ల వ్యవస్థ పై ఆనాడు, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నో సందర్భాలలో, ఎన్నో వేదికల్లో మెచ్చుకోవడమే కాక వాలంటీర్లను కొనసాగిస్తానని, జీతాలను రెట్టింపు చేస్తానని నాడు డంకా భజాయించి చెబితే నేడు వాలంటీర్ల వ్యవస్థకు మనుగడే లేదని, శాసనమండలిలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడడం వాలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడటమేనని ఆమే అన్నారు. నాడు ఎన్నికల సమయంలో వాలంటీర్లకు ఐదు వేల నుండి రూ.10 వేలు జీతం పెంచుతామని, వారి సేవలు ప్రశంసనీయమనని పొగిడి నేడు దానికి మనుగడ లేదనటం ఏటిలో ఉన్నప్పుడు ఏటి మల్లన్న ఏరు దాటాక బోడి మల్లన్నఅన్నట్లు ఉందని ఆమే ఎద్దేవా చేశారు. కానీ ఇటీవల సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దానికి సంబంధించిన జీవో లేదనడం, అలాంటి వాలంటీర్ల వ్యవస్థ అవసరమే లేదు అనడం మాట తప్పి మడమ తిప్పడమేనని దీనికి కూటమి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆమే తెలిపారు. ప్రభుత్వ పథకాలను సకాలంలో ప్రజలకు చేర్చడం గడపగడపకు అందించడంలో వాలంటీర్ల వ్యవస్థ కీలక పాత్ర పోషించిందని, భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆమే కొనియాడారు. కరోనా కష్ట కాలంలో ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆదర్శంగా గడప గడపకు ప్రతి ఒక్కరికి వ్యాక్సినేషన్, కావలసిన మందులు అందజేయడంలోనూ, నిత్యవసర సరుకులు పంపిణీ చేయడంలో కానీ వారు చేసిన సేవలు ఆదర్శంగా నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. అటువంటి వాలంటీర్ల వ్యవస్థను విస్మరించడంతోపాటు అవహేళనగా అవమానకరంగా మాట్లాడటం ఏమిటని ఆమె అన్నారు. ఈ మటలు విని విజయనగరం జిల్లాలో ఒక వాలంటరీ మరణించారు. ఇటువంటి మరణాలు సంఖ్య పెరగకుండా చూచాల్సిన బాధ్యత ప్రభుత్వ మేనని అందువలన గొప్ప సేవలు అందించి ప్రశంసలు పొందిన వాలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించాల్సిందేనని వారికి కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి వారికి జీతాలు ఇవ్వవలసిందేనని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు.

# శ్రీ అగస్త్యేశ్వర స్వామి.. పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వరద



**ప్రొద్దుటూరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** ప్రముఖ వ్యాస రచయిత డాక్టర్ ఐ ఎల్ ఎన్ చంద్రశేఖర రావు రచించిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయం పుస్తకాన్ని కొనిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొత్తపల్లి గ్రామ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి పుస్తక ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పూర్వీకులు ప్రొద్దుటూరు నడిబొడ్డున శివాలయాన్ని నిర్మించారని ఆలయ పోషణకు వందల ఎకరాలు తమ సొంత భూములు కేటాయించారన్నారు. ఆలయ భూములను కూడా వదలక ఆక్రమిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు అలాంటి వారిని దేవుడు క్షమించరని తెలిపారు. ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీ ఆగేశ్వర స్వామి శివాలయం చరిత్రను అవగాహన చేసుకుని పుస్తకాన్ని రచించిన డాక్టర్ ఐ ఎల్ ఎన్ చంద్రశేఖర రావు అభినందనీయులని కొనియాడారు. శివాలయం చరిత్ర చాలా మందికి తెలియక పోవచ్చని ఈ పుస్తకాన్ని విక్రయించి ఆలయ ప్రాశస్త్యాన్ని తెలుసుకోవాలని సూచించారు. ముందుగా పుస్తక సమీక్షకులు ఎస్ మహబూబ్ బాషా మాట్లాడుతూ రచయిత చంద్రశేఖర రావు కడప జిల్లా వాసిని ప్రొద్దుటూరులో జన్మించారన్నారు. శ్రీ అగస్త్యేశ్వర స్వామి పుస్తకంలో రచయిత పొందుపరిచిన అంశాలను సంక్షిప్తంగా ఆయన వివరించారు. శివాలయంలోని శివలింగాన్ని అగస్త్య ముని ప్రతిష్టించారని అందుకే శ్రీ అగస్టేశ్వర స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందినట్లుగా అందరికీ తెలుసన్నారు కానీ ఆలయంలోని ఉప ఆలయాల సమీకరణ పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన శివతాండవం లాంటి విశేషాలను పొందుపరచారన్నారు. కొని రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎన్నో ఆలయాలు సందర్శించి సుమారు 33 పుస్తకాలు రచించిన డాక్టర్ ఐ ఎల్ ఎన్ చంద్రశేఖర రావు శ్రీ అగస్త్యేశ్వర స్వామి చరిత్రను రాయడం ఆ పుస్తకాన్ని కొనిరెడ్డి ఫౌండేషన్ లో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం తనకు కలిగిన మహా భాగ్యంగా ఆయన అభివర్ణించారు. తాను శివాలయం చైర్మన్గా ఉన్న సమయంలో రెండు గాలిగోపురాలు నిర్మించామని అంతే కాకుండా ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. రచయిత ఐ ఎల్ ఎన్ చంద్రశేఖర రావు మాట్లాడుతూ తన జన్మ నేపథ్యం ప్రొద్దుటూరు అని బాల్యంలో చాలాసార్లు శివాలయాన్ని సందర్శించారని అన్నారు ఎంతో ప్రసిద్ధిగాంచిన అలాంటి శివాలయ చరిత్రను రచించడం తనకు శివుడు ఇచ్చిన భాగ్యమన్నారు. ఈ పుస్తకాన్ని ప్రచురించి ఘనంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అవధాని నరాల రామారెడ్డి శివాలయం చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ప్రముఖ కథా రచయిత డీకే చదువుల బాబు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ జనార్ధన్ కొని రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన కార్పొరేటర్ చందన



**వరంగల్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** గోవాలో జరిగిన కరాటే జాతీయ టోర్నమెంట్లో వరంగల్ నగరంలోని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించడం అభినందనీయమని 42 వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అన్నారు. నవంబర్ నెల 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్లో రంగశాయిపేట లోని పరమేశ్వర కరాటే అకాడమీకి చెందిన తండ విస్రిత, తాటికొండ సంజయ్ సచిన్ ఇద్దరు కరాటే లో విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించినందున సోమవారం 42 వడివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ ఇద్దరినీ శాలువాలతో సత్కరించి అభినందించినారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు, సెల్ఫ్ డిఫెన్స్ కు కరాటే విద్య ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రంగశాయిపేట ప్రాంతంలో పాఠశాల స్థాయి కరాటే విద్యార్థులు చాలామంది శిక్షణ పొందుతున్నారని వారిని వివిధ టోర్నమెంట్లలో పాల్గొనే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు, కరాటే శిక్షకులు ప్రోత్సహించాలని కోరారు. ఇటీవల గోవాలో జరిగిన జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్లో 5 నుండి 13 సం.ల బాలికల ఏజ్ గ్రూపు బ్లాక్ బెల్ట్ విభాగంలో తండ విస్రిత గోల్డ్ మెడల్ ను సాధించిందని, బాలుర గ్రీన్ బెల్ట్ విభాగంలో తాటికొండ సంజయ్ సచిన్ గోల్డ్ మెడల్ ను సాధించారని గుండు చందన తెలిపారు. గోల్డ్ మెడల్స్ సాధించిన ఇద్దరు విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, వీరికి కరాటేలో శిక్షణను ఇచ్చిన కోచ్ లు కరాటే మాస్టర్ తూమల పరమేశ్వర్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ చీకటి చిన్న సమ్మయ్యకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

# వైభవంగా కార్తీక మాస చివరి సోమవారం

**స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ, పూజలు**

**కార్తీక దీపాలు సమర్పించిన భక్తులు**



**ప్రొద్దుటూరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** పరమశివునికి ప్రీతికరమైన కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు శివాలయాల వద్ద స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులు ఆలయాలకు చేరుకుని మహాశివునికి అభిషేకాలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి పరమశివున్ని భక్తిశ్రద్ధలతో పూజించారు. కొంత మంది భక్తులు పలు శైవక్షేత్రాలకు స్వామివారి దర్శనానికి తరలి వెళ్లారు. స్థానిక అగస్త్యేశ్వరాలయంలో అగస్త్యమహాముని ప్రతిష్టించిన శివలింగానికి రుద్రాభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రా చార్యులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరాలయంలో శ్రీరాముడు ప్రతిష్టించిన సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి, ఆది శంకరాచార్యులు ప్రతిష్టించిన శ్రీచక్రానికి విశేష అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. పెన్నానదీ తీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకతలింగానికి, నవరత్న లింగానికి, జలలింగానికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణంలోని అన్ని శివాలయాల్లో కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. అదేవిధంగా స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి దేవాలయం సముదాయంలోని కాశీ విశ్వేశ్వర స్వామి వారికి ప్రత్యేక గోక్షీర, పంచామృత అభిషేకాలు, పూజలు, పుష్పాలంకరణ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ముంగిళ్లలో భక్తులు వెలిగించిన కార్తీక దీపాల వెలుగులో నూతన శోభను సంతరించుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పోలీసులు, ఆలయాల నిర్వాహకులు జరుగకుండా పర్యవేక్షించారు.

# తల్లి చెంతకు పిల్లలను అప్పగించిన పోలీసులు

- విడాకుల కేసును తప్పుదోవ పట్టించడానికి తనపై అక్రమ సంబంధం అంటగట్టారని ఓ మహిళ ఆవేదన



**తిరుపతి, నవంబర్ 25 (నిఘా న్యూస్):** తల్లి నుండి ఇద్దరు బిడ్డలను వేరు చేసి భర్త తీసుకెళ్లడంతో, తల్లి నాగవర్ధిని ఫిర్యాదు మేరకు తిరుపతి అలిపిరి పోలీసులు స్పందించి సోమవారం తన బిడ్డలను అప్పగించి శభాష్ అనిపించుకున్నారు. బాధితురాలు నాగవర్ధిని తెలిపిన వివరాల మేరకు తిరుపతి పట్టణానికి చెందిన వినాయక నగర్ టిటిడి క్వాటర్స్ లో నివసిస్తూ ఆమె టిటిడి బోర్డులో కాంట్రాక్ట్ ఉద్యోగిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాలు నుండి తన భర్త ప్రవర్తనలో తేడా రావడంతో ఇద్దరు పిల్లలతో కలిసి నాగవర్ధిని క్వార్టర్స్ లోని జీవిస్తూ ఉండేదని తెలిపింది. నాగవర్ధినికి, భర్త లచ్చి రాముడికి నాగవర్ధునికి వివాహం జరిగి వారికి ఇద్దరు పిల్లలు పుట్టారని తెలిపింది.ఇద్దరు పిల్లలు పుట్టే అంతవరకు తన భర్త బాగానే ఉన్నారని ఆ తర్వాత అతను తనకు తెలియకుండా హైదరాబాద్ కు చెందిన శాంతి అనే యువతిని వివాహం చేసుకొని ఆమెకు ఒక కూతురు కూడా ఉన్నట్లు గుర్తించామని వివరించింది. చాలా అన్యోన్యతగా ఉన్న తమ భార్యాభర్తల మధ్య తగాదాలు రావడంతో భర్తకు దూరంగా బిడ్డలను పోషించుకుని బతుకుతున్నానన్నారు. ఇంత అన్యాయం చేసిన భర్త నుండి విడిపోవాలని నిర్ణయించుకుని విడాకులకు కోర్టులో అప్లై చేశానని తెలిపింది.గత మూడు సంవత్సరాల నుండి మా విడాకులు కేసు కోర్టులో జరుగుతున్నదని ప్రతి వాయిదాకు వెళుతూ వస్తున్నానని ఆమె పేర్కొంది. వచ్చే నెలలో కోర్టు వాయిదా ఉండడంతో కేసును తప్పుదారి పట్టించడానికి తన తల్లిదండ్రులకు తన భర్త లచ్చి రాముడు లేనిపోని ఆరోపణలతో రెచ్చగొట్టాడని వివరించింది.భర్త లచ్చి రాముడు తనపై చేస్తున్న ఆరోపణలను సోమవారం నాగవర్ధిని మీడియా ముందు వివరించింది.తన భర్త లచ్చి రాం, అమ్మానాన్నల నుండి తనకు తన పిల్లలకు ప్రాణహాని ఉందని ఆరోపించింది. ఈ విషయంలో పోలీసులు, మీడియా వారు తనకు రక్షణ కల్పించి, తనకు ఇబ్బంది పెట్టాలని అనుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఆరోగ్య మందిరాలలో.. యోగా ఇన్స్ట్రక్టర్ల నియామకం



**వరంగల్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** వరంగల్ జిల్లాలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో కొత్తగా యోగా ఇన్స్ట్రక్టర్లను డిపార్టుమెంట్ ఆఫ్ ఆయుష్ శాఖ విభాగంలో ఎంపికైన యోగా ఇన్స్ట్రక్టర్లకు అపాయింట్మెంట్ లెటర్లను రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రమీలా దేవి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయుష్ డిపార్టుమెంట్ ఇన్చార్జి మైదం రాజు, డీపీఎం జి.రాజు పాల్గొన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో కొత్తగా ఎంపికైన యోగా ఇన్స్ట్రక్టర్లు గర్భవతులు, రోగులు, మానసిక రోగులకు యోగా నేర్పిస్తారని ఆర్డీడీ తెలిపారు. వరంగల్ జిల్లాలో ఆయుష్మాన్ పరిధిలో ఎంపికైన యోగా ఇన్స్ట్రక్టర్లు ఎంజీఎం హోమియో విభాగంలో ఎస్.ప్రేమలత, ఆంజనేయులు, ఎంజీఎం యూనానీ విభాగంలో మౌనిక, వశిష్ట, రాంచంద్రాపురంలో రజిత, రామకృష్ణ, సన్నూరులో విష్ణు, కల్పన, ఎల్కుర్తిలో మహేష్, మేఘన, నల్లబెల్లిలో మానస, బుధరావుపేట నసీఫ, ఇటుకాలపల్లిలో వినోద ఎంపికయ్యారని, వారికి నియామ కపత్రాలు అందజేసినట్లు తెలిపారు.

## ఎస్సారైటీలో ఇండస్ట్రియల్ ఎక్సపెర్ట్ టాక్

**ప్రొద్దుటూరు, నవంబర్ 25 (నిఘా న్యూస్):** మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో వున్న సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐఎస్ టిఈ) తో బిటెక్ సివిల్ విద్యార్థులకు ప్రొద్దుటూరు సిండికేట్ ప్లానర్స్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ చే ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి ఆధ్వర్యంలో "రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్ఎస్ అండ్ జిఐఎస్ - జిపిఎస్ అనే అంశం మీద ఎక్సపెర్ట్ టాక్ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ పాత పద్ధతులు, భౌగోళిక సమాచార వ్యవస్థ, ప్రస్తుత సివిల్ ఇంజనీరింగ్ రంగంలో అవలంబిస్తున్న గ్లోబల్ పొజిషన్ సిస్టమ్ గురించి వివరంగా తెలియజేశారు. సివిల్ హెచ్ఓడి సురేష్ బాబు మాట్లాడుతూ జీపీఎస్ తో శిక్షణ, ప్రాజెక్టు వర్క్ చేయడం, జీపీఎస్ ప్రయోజనాలను గురించి విద్యార్థులకు వివరించారు. చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి లు ఎక్సపెర్ట్ టాక్ లోని అంశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మహిళను ట్రాప్ చేసి.. కుటుంబాన్ని రోడ్డుకి ఈడ్చిన యూట్యూబర్

**యూట్యూబర్ నుండి మా బిడ్డలకు రక్షణ కల్పించండి**

**విలేకరుల సమావేశంలో వారి తల్లిదండ్రులు**

**తిరుపతి, నవంబర్ 25 (నిఘా న్యూస్):** ఇస్కాన్ టెంపుల్, వినాయక నగర్ లో నివాసముంటున్న ప్రభుత్వ ఉద్యోగి కృష్ణ ప్రసాద్ కుమార్తె కుటుంబంలోని కలహాలను అవకాశంగా తీసుకుని యూట్యూబర్ వారి మధ్య చిచ్చు పెట్టి విడాకులు తీసుకోమని ప్రేరేపించి అభం శుభం తెలియని అమాయకురాలైన తన కూతురును అనుభవిస్తున్నాడని నాగవర్తిని భర్త లచ్చిరాం, తల్లి శ్యామల కుమారి లు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో సోమవారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ దిశా పోలీస్ స్టేషన్ వద్ద మహిళలు ఎవరైనా కుటుంబ కలహాలతో ఫిర్యాదు చేయడానికి వస్తే వారిపై టార్గెట్ పెట్టడం వారిని నమ్మించి వారి శీలాన్ని దోచుకోవడం యూట్యూబర్ దిన చర్యగా పెట్టుకున్నాడని ఆరోపించారు. యూట్యూబర్ కు కొంతమంది పోలీసుల అండదండలు ఉన్నట్లు వీరు ఆరోపించారు. అలిపిరి పోలీస్ స్టేషన్ లో కూడా ఈ కేసు పై విచారణ జరిగిందన్నారు. అయినా తమకు న్యాయం జరగలేదన్నారు. తన కూతురును చేతిలో పెట్టుకుని తమ కుటుంబానికి ఆదదిక్కుతో పాటు చిన్న బిడ్డలను దూరం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై జిల్లా ఎస్పీ స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని వేడుకున్నారు.

# ప్రభుత్వ భూములను.. సంపన్నులకు కేటాయించడం ఆపాలి

- నాలుగు కోట్ల విలువ గల స్థలం సంపన్నులకు కేటాయింపు.
- రెవెన్యు మున్సిపల్ అధికారుల చేతి వాటం
- సంగారెడ్డిలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి
- బీజేపీ టెలికాం బోర్డు మెంబర్ రవి శంకర్ డిమాండ్



**సంగారెడ్డి, నవంబర్ 25 (నిఘా న్యూస్):** ప్రభుత్వ స్థలాలు నిరుపేదల ఆదుకోవడానికి ఉంటాయని అందరు అనుకుంటారు, కానీ సంగారెడ్డి మున్సిపాలిటీలో రెవెన్యుశాఖ మున్సిపల్ అధికారులు చేతి వాటం ప్రదర్శిస్తూ విలువైన ప్రభుత్వ స్థలాలు ప్రభుత్వ ఉద్యోగులకు వ్యాపారులకు కట్ట బెట్టుటను బిజెపి టెలికాం బోర్డు మెంబర్ రవి శంకర్ తీవ్రంగా తప్పు బట్టారు.మున్సిపల్ బైపాస్ రోడ్డు లో ఉన్న ప్రభుత్వ స్థలంను ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులకు కేటాయిస్తున్నరని తెలంగాణ ప్రభుత్వం బీజేపీ టెలికాం బోర్డు మెంబర్ రవి శంకర్ తప్పుబట్టారు. సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్లో ఫిర్యాదు చేశారు. అనంతరం, ప్రభుత్వ స్థలలాలు భూముల సైతం కబ్జాలకు గురైన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పేదలకు చెందాల్సిన స్థలాలు పట్టణంలో పక్క దారి పట్టు తున్నాయని తెలిపారు. స్థలాల కేటాయింపుల్లో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్లో ఎం.పి.డి.ఓ కార్యాలయానికి ఎదురుగా సర్వే నంబర్ 374/1 క్రింద ఉన్న రూ.4 కోట్ల విలువైన స్థలం రెవెన్యూ మున్సిపల్ అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని బిజెపి రవి శంకర్ ఆరోపించారు. 59 జీవోను బలవంతంగా ఉపయోగించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేపడుతున్నారని, పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు స్థానికేతరులు 58,59 జీవో కింద అర్హులుగా ఎలా గుర్తించ బద్దారో రెవెన్యు అధికారులు తెలుపాలని ప్రశ్నించారు. పట్టణంలోవాణిజ్య స్థలంపై అక్రమంగా ఐదు ఇంటి నంబర్లను మున్సిపల్ అధికారులు లంచాలు తీసుకుని కేటాయించారని తెలిపారు. అధికారుల అవినీతి కారణంగా ప్రజా అవసరాలకు అనువుగా ఉండాల్సిన ప్రభుత్వ స్థలాలు అనాన్య క్రాంతం చేస్తున్నారని తెలిపారు. అధికారుల స్వార్ధ ప్రయోజనాల కోసమే నిరుపేదలకు చెందాల్సిన స్థలాలు పట్టణంలో మాయం చేస్తున్నారని పేర్కొన్నారు. సంగారెడ్డిలో అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఉన్నత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టీ అవినీతి అధికారులు విధుల్లో నుంచి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని, డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు వ్యాపారులకు కేటాయించిన స్థలాల పర్మిషన్లను రద్దు చేయాలని అధికారులను కోరారు. ఈ స్థలాలు నిరుపేదల కోసం ఉపయోగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్లు నాయికోటి రమేష్, కసిని వాసు, మందుల నాగరాజు, ద్వారక రవి తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

**కట్ట మైసమ్మ దేవాలయ నిర్మాణ పనులకు భూమి పూజ**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**అమీన్‌పూర్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడ సిద్ధార్థ కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ దేవాలయం పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 200కు పైగా దేవాలయాలు నిర్మించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, ఈర్ల శ్రీకాంత్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్తమ మున్సిపాలిటీలో కానరాని అభివృద్ధి జాడ



**ఇల్లందు, నవంబర్ 25 (నిఘా న్యూస్)** ఇల్లందు మున్సిపాలిటీని అభివృద్ధి పదంలో నడిపిస్తానంటూ గద్దెనెక్కిన నేతను నమ్మి ఓట్లేసిన పాపానికి పదో వార్డు ప్రజల అవసరాలకు సంబంధించిన పనులను గాలికి వదిలేసారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. కరెంటు పోల్స్ ఉన్నాయనటమే తప్ప లైట్లు లేని దుస్థితి. జెకే బస్ స్టాప్ లో బస్సు దిగగానే నడిచి వెళ్లే పాదచారులు అంధకారంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందంటున్నారు. బ్యాచిలర్ హాస్టల్‌గా ఉన్నటువంటి పాత బిల్డింగ్ ప్రాంతం ఆకతాయిలు, మందు బాబులకు అడ్డగా మారిందని. ఆ ప్రాంగణంలో చెట్లు విపరీతంగా ఉండటంతో ఆ దారి వెంట మహిళలు వెళ్లాలంటేనే భయపడుతున్నామంటూ పేర్కొన్నారు. కాంట్రాక్ట్ పనుల నిమిత్తం రోడ్డు ప్రక్కన పెద్దగా గుంతలు తీసి గత రెండు సంవత్సరాలుగా వదిలేసారని దాని ప్రక్కనుండి దారి ఉండ టంతో నిత్యం రద్దీగా ఉంటుందని ఆదమరిస్తే అంతే అంటు స్థానికు లు ఆగ్రహించారు. జెకె అభయాంజనేయ స్వామి దేవాలయానికి వచ్చే భక్తులు వీధిలైట్లు లేని కారణంగా ఉదయం, సాయంత్రం సమయంలో గుడికి వచ్చేవారు చీకటి కారణంగా రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్లవల్ల విష పురుగులు పాములతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. పదో వార్డులోని ఇన్ని సమస్యలు ఉన్నాయని వాటిని పట్టించుకునే నాథుడు కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి. వీధి లైట్లను ఏర్పాటు చేసి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని కోరారు.

## న్యాయ విద్యార్థిని ఆత్మ హత్యపై అనుమానాలు

**పోలీస్ స్టేషన్ ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన**



**మలక్‌పేట, నవంబర్ 25 (నిఘా న్యూస్):** మలక్ పేట్ పిఎస్ పరిధిలో సోమవారం విషాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడ్తాల్ మండల పరిధి ఓ తండాకు చెందిన ఇస్లావత్ శ్రావ్య (20)లా 3వ సంవత్సరం చదువుతూ ఓ సీనియర్ అడ్వకేట్ వద్ద జూనియర్‌గా పనిచేస్తుంద న్నారు. ఈ క్రమంలో అనుమానస్పద స్థితిలో కార్యాలయంలో ఉరేసు కొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలిం చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పథకం ప్రకారమే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. అంటూ పోలీస్ స్టేషన్ ఎదుట గిరిజన సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో టెన్షన్ వాతావరణ నెలకొంది. అయితే విద్యార్థిని మృత దేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలిం చారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

## విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరిస్తే

# కఠిన చర్యలు



**● ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లిస్తుంది ● తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించరాదు ● జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, నవంబరు 25 (నిఘా న్యూస్):** ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ విద్యార్థికి హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించడం చేయరాదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఏ కళాశాల లలో అయినా పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ జరగలేదనే కారణంతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకుండా నిరోధిస్తే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. కళాశాల ఫీజు చెల్లించక పోవడం వల్ల కొంతమంది పోస్ట్ మెట్రిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వకపోవడం, వారిని పరీక్షలను రాయనీయక పోవడం జరుగుతోందని తమ దృష్టికి వచ్చిందన్నారు. కోర్స్ పూర్తయిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఇవ్వకుండా అట్టి పెట్టుకో వడం చేయకూడదని ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చిందని, ఎవరైనా కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థుల సర్టిఫికెట్లను హోల్డ్ చేయడం చేస్తే సంబంధిత కళాశాలను బ్లాక్ లిస్టులో పెట్టడం, వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంద న్నారు. ప్రభుత్వం ఫీజును కళాశాలల అకౌంట్లలోకి జమ చేయడం జరుగుతుందని ప్రకటించుట జరిగిందని, కళాశాలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లించడం జరుగుతుందన్నారు. ఏ కళాశాల లోనూ విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులు పెట్టరాదని సూచించారు.

## అధికార పార్టీ నేతలు చెబితేనే పనులు

**పాలక పార్టీ కొమ్ము కాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి**

**మేయర్ విజయ లక్ష్మిని కలిసి ఫిర్యాదు చేసిన కార్పొరేటర్లు**




**మల్కాజిగిరి, నవంబర్ 25 (నిఘా న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మి ని మల్కాజిగిరి నియోజక వర్గం పరిధి కార్పొరేటర్లు కలిసారు. జరుగుతున్న ప్రోటోకాల్ ఉల్లంఘన, ప్రజల సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం వంటి అంశాలపై మేయర్ దృష్టికి వివరిస్తూ వినతి పత్రం ఇచ్చారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి పని ప్రారంభోత్సవం, అధికారులు ప్రోటోకాల్ కు విరుద్ధంగా జరిపిస్తున్నారని చెప్పారు. స్థానిక బిఆర్ఎస్ కార్పొరేటర్లకు తమ డివిజన్ లలో ప్రాధాన్యత ఇవ్వకుండా, అధికార పార్టీ నాయకులు చెబితేనే పనులు జరుగుతున్నాయని, స్థానిక ఎమ్మెల్యే కు కూడా తెలియజేయకుండా పనులు మొదలు పెడుతున్నారని కార్పొరేటర్లు మేయర్‌కు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నలలో అధికారులు పనిచేస్తున్నారని తమకు రాజకీయ ఒత్తిడి ఉందని అధికారులు బాహటంగా ఒప్పుకుంటున్నారని, సదరు అధికారులపై శాఖాపరమైన, క్రమశిక్షణ చర్యలు తీయనుకోవాలని కోరారు. తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్ ప్రకారం సెక్షన్ 153 - 154 - 155 ప్రకారం శాఖాపరమైన చర్యలు వెంటనే తీసుకువాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘనకు సంబంధించిన ఆధారాలతో పత్రికలలో వచ్చిన వార్తలను కూడా మేయరుకు అందజేశారు. మేయర్ ను కలిసిన వారిలో అల్వాల్ కార్పొరేటర్ శాంతి రెడ్డి, వెంకటాపురం కార్పొరేటర్ సబితా రెడ్డి, నెరెడ్ మేట్ డివిజన్ కార్పొరేటర్ మీనా రెడ్డి అన్నారు.

## రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- **రాజ్యాంగం ద్వారనే దళితుల విముక్తి**
- **డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్**



**వరంగల్, నవంబర్ 25 (నిఘా న్యూస్):** భారత రాజ్యాంగ దినోత్స వాన్ని అధికారికంగా నిరతవహిం చేలా జిల్లా సంబంధిత అధికారు లకు సర్క్యులర్ జారి చేయాలని, 75 ఏళ్ళ రాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్భంగా ఉత్సవంల జరపాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం రోజున జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకట్ రెడ్డికి డిబిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది మంది అణగారిన వర్గాలను బానిసత్వం, దోపిడీ, పీడన, అవిద్య నుండి భారత రాజ్యాంగం విముక్తి కల్పించిందన్నారు. భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, 75 ఏళ్ళ సందర్భంగా లోకసభ, రాజ్యసభ ఉభయ సభల సంయుక్త సమావేశాలు జరుగుతున్నందున రాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలి సభల సంయుక్త సమావేశాలు నిర్వహించి భారత రాజ్యాంగ స్ఫూర్తిపై చర్చించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కాలేజిలు, సంక్షేమ హస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో అందరూ రాజ్యాంగ పిఠిక ప్రతిజ్ఞ చేసేలా అధికారికంగా నిర్వహించి, పండగ లాగ జరిపి బాబా సాహెబ్ అంబేద్కర్ ఉద్యమ వారసత్వాన్ని కొనియాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, జిల్లా మహిళ నాయకురాలు బౌతు రాధ, అదేపు రమ, పెద్ద రమాదేవి, దళిత నిరుపేదల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింగారపు ప్రేమ్ కుమార్, రాజు, కిరణ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## క్యారం పోటీలలో ప్రపంచ విజేతగా నిలిచిన శ్రీనివాస్

**సన్మానించిన ఎమ్మెల్సీ కోదండరామ్**



**అంబర్‌పేట, నవంబర్ 25(నిఘా న్యూస్):** అమెరికాలో జరిగిన అంతర్జాతీయ క్యారం పోటీలలో ప్రతిభ కనబరిచి ప్రపంచవిజేతగా నిలిచిన తెలంగాణ క్రీడాకారుడు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారి కే.శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఘనంగా సన్మానించారు. క్యారం అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎస్.మదన్ రాజ్, ఉపాధ్యక్షుడు ఉప్పు సుధాకర్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ కోదండరామ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మదన్ రాజ్ మాట్లాడుతూ అంతర్జాతీయ క్యారం పోటీలో విజేతగా నిలిచి కాంస్య పతకాన్ని సాధించిన ఎస్. ఆదిత్యకు తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కోదండరామ్ చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

## అయ్యప్ప స్వాములపై ఆలయ చైర్మన్ హల్చల్

**తాగి వచ్చి రోజు గొడవలు సృష్టిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు**



**రామంతాపూర్, నవంబర్ 25( నిఘా న్యూస్):** ఉప్పల్ రామంతాపూర్ లోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం ఛైర్మన్ నరసింహారెడ్డి మద్యం తాగి హల్చల్ చేశారు. ఆదివారం రాత్రి అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములపై దుర్భాషలాడుతూనేను ఛైర్మన్‌ని, నేను చెప్పినట్లు నడవాలంటూ బెదిరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు మీడియాతో మాట్లాడుతూ తమను రోజు తాగి వచ్చి చైర్మన్ నరసింహా రెడ్డి రోజు వేధిస్తున్నారని, బట్టలు బయట పడేస్తున్నాడని, పూజ చేసు కునే సమయంలో ఇబ్బందుల గురి చేస్తున్నారని ఆరోపించారు. దీంతో స్వాములు ఆలయ ఛైర్మన్ నరసింహారెడ్డిపై ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప్పల్ పోలీసులు ఈ కేసును కోర్టుకు రిఫర్ చేసినట్లు తెలిపారు. కోర్టు అనుమతి రాగానే కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

## 108సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థి మృతి





**కంగ్టి, నవంబర్ 25 (నిఘా న్యూస్):** 108 సిబ్బంది నిర్లక్ష్యంతో స్టూడెంట్ మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని గాజుల్ పాడ్ గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే కంగ్టి మండల పరిధిలోని చాప్టా(కే)గ్రామానికి చెందిన వీరబాయి మారుతీ కొడుకు కూతురు ఉన్నారు. కృష్ణ(14)అమ్మమ్మ ఊరు గాజుల్ పాడ్ నుండి కంగ్టి మండల కేంద్రంలోని ఓ స్కూల్ కు వెళ్ళేవాడు. ఆదివారం ఆడుకుంటూ కూల్ డ్రింక్ అనుకోని డబ్బాలో ఉన్న గడ్డి మందు తాగేశాడు. సృహ తప్పి కిందపడిపోవడతో దింతో అప్రమత్తమైన మేనమామ హుటాహుటిన బైక్‌పై కంగ్టి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. డాక్టర్లు అక్కడ నుండి ఖేడ్ హాస్పిటల్ కు రిఫర్ చేయడంతో 108 అంబులెన్సు కాల్ చేశారు. నేరుగా అంబులెన్సు సిబ్బందితో చరవాణి ద్వారా మాట్లాడిన రాలేదని స్టూడెంట్ తల్లిదండ్రులు ఆరోపించారు. అంబులెన్సు రిపేర్ ఉందని రాలేమని నిర్లక్ష్యంగా మాట్లాడరని తల్లీ వీరబాయి తెలిపారు. కంగ్టి హాస్పిటల్ నుండి ఖేడ్ బైక్ పైనే తీసుకెళ్లామని, సంగారెడ్డి తరలిస్తుండగా మార్గమాధ్యలో చనిపోయా దన్నారు. సరైన టైంకు అంబులెన్సు వస్తే నా కొడుకు బతుకు తుండే అని నా బిడ్డ చనిపోవడానికి అంబులెన్సు సిబ్బంది రాకపోవడమే కారణం అని నిర్లక్ష్యం వహించి అధికారులపై చర్యలు తీసుకోని తమకు తగిన న్యాయం చేయాలనీ బాధితులు పేర్కొన్నారు.

### హార్ట్ ఎటాక్‌తో మరొకరు

మండల పరిధిలోని చాప్టా(కే)గ్రామానికి చెందిన బీరదర్ సంతోష్ (35)అర్థ రాత్రి హార్ట్ ఎటాక్ తో చనిపోవడంతో ఒకే రోజు ఒకే గ్రామంలో ఇద్దరు చని పోవడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# నకిలీ వైద్యులపై టీజీఎంసి కొరడా

- **వేములవాడ సిరిసిల్లలో నకిలీ వైద్యుల క్లినిక్స్ పై టీజీఎంసీ బృందం దాడులు**
- **చదివింది పదవ తరగతి, 10 బెడ్లతో ఆసుపత్రి నిర్వహణ**
- **ఇప్పటివరకు 300 మందిపై కేసులు నమోదు**

**సిరిసిల్ల, నవంబర్ 25(నిఘా న్యూస్):** తెలంగాణా వైద్య మండలి చైర్మన్ డా మహేష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య ఆదేశాల మేరకు సభ్యులు డాక్టర్ బండారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలోని యాంటీ క్వేకరి బృందం పలు నకిలీ వైద్య చికిత్స కేంద్రాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సిరిసిల్లలోని గాంధీ గోపాలరావు నగర్ కి చెందిన బాబా క్లినిక్ నిర్వహిస్తున్న మాదాసు లక్ష్మణ్, పోతుగల్ రోడ్డు ముస్తాబాద్ లోని ముక్తార్ హాస్పిటల్ నిర్వహిస్తున్న ఆర్ఎంపి ముక్తర్, వేములవాడలోని గాంధీనగర్ కి చెందిన అశ్విని క్లినిక్ నిర్వహిస్తున్న బెజ్జంకి రవీందర్ విచ్చలవిడిగా యాంటీబయాటిక్ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించారు. వీరి వద్ద హేతు బద్ధత లేకుండా రోగులకు ఇచ్చిన యాంటీబయాటిక్ ఇంజక్షన్లు వందల సంఖ్యలలో బయటపడ్డాయి. ఆసుపత్రి రిజిస్ట్రేషన్ లేకుండా ఆధునిక వైద్యం చేయడానికి కనీస విద్య అర్హత లేకుండా కొంతమంది పదవ తరగతి మాత్రమే చదివి ఐదు నుంచి పది బెడ్స్ వేసి ఇన్ పేషెంట్ వైద్యం కూడా చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. పలు నకిలీ వైద్యులు అల్లోపతి వైద్యం చేస్తూ పట్టుబడ్డారు. పలు సెంటర్స్ ఓపెన్ చేసి అర్హత లేకుండా వైద్యం చేస్తున్నారని వెలుగులోకి వచ్చింది. తనిఖీలలో విచ్చలవిడిగా ఆంటిబయోటిక్స్, స్టెరోయిడ్స్ ఇస్తునట్టు గుర్తించి తగు ఆధారాలు సేకరించారు. ఎన్ ఎం సి చట్టం 34,54 ప్రకారం వీరిపై కేసు నమోదు చేయనున్నారు. ఎన్ఎంసి చట్టం ప్రకారం విద్యార్హత లేకున్నా అల్లోపతి వైద్యం చేసినందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నారు. ఇలాంటి నకిలీ వైద్యులపై ఇప్పటివరకు 300 నమోదైనాయి. త్వరలో కోర్టులో హాజరు పరిచి చట్టపరంగా శిక్షించబడతారు అని టీజీఎంసీ మెంబర్ డాక్టర్ బండారి రాజ్ కుమార్ పేర్కొన్నారు. చట్ట ప్రకారం అర్హత లేని వ్యక్తులకు ట్రైనింగ్ ఇవ్వడం, ప్రాక్టీస్ చేయడం చట్ట విరుద్ధ%శీ% అని గతం లో కూడా దేశంలో ఎక్కడ లేని విధంగా పలు సార్లు జిఒలు ఇవ్వగా కోర్టులు ఆ జిఒ లను రద్దు చేసిందని గుర్తు చేసారు. ఈ తనిఖీలలో టీజీఎంసీ మెంబర్



డాక్టర్ బండారి రాజకుమార్, భరత్ బృందం సభ్యులు పాల్గొన్నారు. త్వరలో వీరందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠినంగా శిక్షించబడతారని తెలంగాణ వైద్య మండలి 30 బృందాలు రాష్ట్రమంతటా ప్రతి జిల్లాలలో, ప్రతి గ్రామంలో ఈ తనిఖీలు ఇలాగే కొన సాగుతాయని పరిమితి మించి వైద్యం చేసినట్టు గాని గుర్తిస్తే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడినందుకు కఠినంగా శిక్షించడంలో ఉపేక్షించేది లేదని టీజీఎంసి మెంబర్ డాక్టర్ బండారి రాజ్ కుమార్ హెచ్చరించారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com